ఏలూరు ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 33.0
కనిష్ఠం : 25.0

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

3

ఏలూరు

జిల్లా వార్తలు

ఆదివారం 24 ఆగస్టు 2025



ఆలపాడు వద్ద ఉప్పుటేరు ప్రక్షాళన పనులు పరిశీలిస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి, ఎమ్మెల్యే కామినేని

ఉప్పుటేరు ప్రక్షాళనతో.. ముంపు సమస్య పరిష్కారం

» కలెక్టర్ వెట్రిసెల్వి

కైకలూరు/కలిదిండి, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): కొల్లేరు ముంపు సమస్య పరిష్కారానికి ఉప్పుటేరు ప్రక్షాళన పనులను పూర్తిస్థాయిలో నిర్వహించి ఏ ఒక్క గ్రామం ముంపుబారిన పడకుండా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ వెట్రీసెల్వి అన్నారు. కైకలూరు మండలం ఆలపాడు శివారున, కలిదిండి మండలం చినతాడినాడ వద్ద జరుగుతున్న ఉప్పుటేరు ప్రక్షాళన పనులను శనివారం ఆమె ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్‌తో కలసి పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ గతేడాది కొల్లేరు వరదతో అనేక గ్రామాలు ముంపు బారిన పడ్డాయని, ఈ ఏడాది ఆ పరిస్థితి రానివ్వకుండా ఉండేందుకే ఉప్పుటేరు ప్రక్షాళన చేపట్టామన్నారు. నిష్పక్షపాతంగా అక్రమ చేపల, రొయ్యల చెరువులను తొలగించాలన్నారు. ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ మాట్లాడుతూ ఆక్రమణల తొలగింపు వలన ఎగువ గ్రామాల్లో ముంపు సమస్యను పరిష్కరించడంతో పాటు కొల్లేరువాసులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. ఆర్డీవో అచ్యుత్ అంబరీష్, జిల్లా వ్యవసాయశాఖ అధికారి హబీబ్‌బాషా, మత్స్యశాఖ డీడీ బి.నరసయ్య, తహసీల్దార్లు ఎండీ ఇబ్రహీం, రామకృష్ణ, ఇరిగేషన్ డీఈఈ శిరీష, డ్రెయినేజీ డీఈఈ వినోద్ చంద్, ఏఈఈ జయ ప్రకాశ్, రాష్ట్ర చేపల రైతు సంఘం అధ్యక్షుడు తాడినాడ బాబు, వడ్డీసాధికారిక సమితి కన్వీనర్ బలే ఏసురాజు, డీసీ చైర్మన్లు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

స్కూల్ ఆఫ్ స్పోర్ట్స్ ఎక్సలెన్స్ పురస్కారాలకు ఐదు ఉన్నత పాఠశాలల ఎంపిక

ఏలూరు అర్బన్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి):స్కూల్ ఆఫ్ స్పోర్ట్స్ ఎక్సలెన్స్-2025 పురస్కారాలకు జిల్లాలోని ఐదు ఉన్నత పాఠశాలలను ఎంపిక చేసినట్టు డీఈవో వెంకటలక్ష్మమ్మ తెలిపారు. హాకీ లెజెండ్ దివంగత ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని నిర్వహించే జాతీయ క్రీడాదినోత్సవం సందర్భంగా ఈ పురస్కారాలను అందజేస్తారన్నారు. నేషనల్, రాష్ట్రస్థాయి, అంతర్ జిల్లా క్రీడా పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన, పాల్గొన్న పాఠశాలలకు ఈ అవార్డులను అందజేస్తారన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల (పెదవేగి), సెయింట్ థెరిస్సా బాలికోన్నత పాఠశాల (ఏలూరు), ఏఆర్‌డీజీకే మున్సిపల్ హైస్కూలు (ఏలూరు), డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల (వట్లూరు), జడ్పీ హైస్కూలు (కొవ్వలి) తొలి ఐదుస్థానాల్లో నిలిచాయన్నారు. ఆ పాఠశాలల హెచ్‌ఎంలు, వ్యాయామోపాధ్యాయులను ఈనెల 29న డీఈవో కార్యాలయంలో జ్ఞాపిక, సర్టిఫికెట్ అందించి సన్మానిస్తామన్నారు.

సైకిల్ సారథి.. ఎవరు?



పార్లమెంట్ నియోజక వర్గాల వారీగా టీడీపీ కొత్త నాయకత్వ బాధ్యతలను అప్పగించే దిశగా కార్యాచరణకు దిగింది. 2019 తర్వాత ఒకేసారి అప్పట్లో పార్లమెంట్ స్థాయిలోనే అధ్యక్షుడిని ఎంపిక చేశారు. ఆ తర్వాత రెండేళ్ల పాటు కరోనాతో అన్ని పార్టీల్లో కదలికలు నిలిచి పోయాయి. ఆపై ఎన్ని కలు ముంచుకురావడంతో ఉన్న నాయకత్వంతోనే వ్యవహారం నడపాలని ఏమార్పులు, చేర్పులు చేయ లేదు. సంస్థాగతంగా మరింత బలపడేలా సాధ్యమైనంత మేర ఏకాభి ప్రాయం ద్వారానే పార్లమెంట్ నియోజక వర్గాల వారీగా అంటే ఇప్పుడున్న జిల్లాల వారీగా నూతన అధ్యక్షుడిని ఎంపిక చేయాలని భావిస్తున్నారు. ఈ దిశగానే జిల్లాలో నేడు కీలక సమావేశం జరగనుంది.

» ఏలూరులో నేడు కీలక సమావేశం » మంత్రి గొట్టిపాటితో సహా పరిశీలకుల రాక

» కార్యకర్తలు, నేతల నుంచి అభిప్రాయ సేకరణ

» గన్నితో పాటు చింతమనేని, ఘంటా మురళి పేర్ల ప్రస్తావన

» ఇప్పటికే నియోజకవర్గాల వారీగా సీనియర్ల ఆరా

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి)



తెలుగుదేశం సంస్థాగత వ్యవహారాలపై దృష్టి పెట్టింది. చాన్నాళ్ల తర్వాత ప్రస్తుతం ఉన్న జిల్లా నాయకత్వాన్ని మార్చడమా, లేక కొనసాగించడమా అనే విషయంలో తుది నిర్ణయం దిశగా అభిప్రాయ సేకరణకు దిగింది. అందరి అభిప్రాయాలను నమోదు చేయబోతున్నారు. ఆ తర్వాత అధిష్ఠానానికి నివేదిక అందించబోతున్నారు. ఇప్పటికే జిల్లాకు ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు పార్టీ అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. వైసీపీ జమానాలో పార్టీ కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించడంలో గన్ని కొంత సక్సెస్ సాధించారు. నియో జకవర్గాల వారీగా పార్టీలో నిస్తేజం అలముకున్న నేపథ్యంలోనూ ఉత్సాహవంతులైన కార్యకర్తలతోనే వైసీపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నడుం బిగించారు. అప్పట్లో గన్ని వీరాంజనేయులుతో పాటు ఫైర్ బ్రాండ్ చింతమనేని ప్రభాకర్ పేర్లు వినిపించాయి. కానీ ప్రభాకర్ జిల్లా నాయకత్వ బాధ్యతలు స్వీకరించేందుకు ఆసక్తి ప్రదర్శించలేదు. దీంతో గన్ని నాయకత్వం వైపే టీడీపీ అధినాయకత్వం మొగ్గు చూపింది. గత ఐదేళ్లుగా ఆయనే అధ్యక్షుడిగా సారథ్యం వహిస్తున్నారు. ఈ మధ్య కాలంలో పార్టీలో చిన్నాచితకా విభేదాలున్నా ఒక్క గాడిన పెట్టడం, వర్గాల మధ్య సమన్వయానికి ప్రయత్నించి కొంత సక్సెస్ అయ్యారు. గడిచిన ఎన్నికల సమయంలో తనకు పోటీ చేసేందుకు అవకాశం లేకపోయినా పార్టీ అధ్యక్షుడిగా అన్ని నియోజకవర్గాల్లో ప్రచారం, ఇతరత్రా వ్యవహారాలను సమన్వయం చేశారు. ఈ కారణంగానే ఈ మధ్యనే గన్నికి స్థానిక సహకార సంఘం, డీసీసీబీ, ఆప్కాబ్ చైర్మన్‌గా వ్యవహరించేందుకు అవకాశం ఇచ్చింది. పార్టీ పరంగా ఆయనకు లభించిన అతిపెద్ద బహుమతి ఇది.

ఇప్పుడేం జరగబోతుంది..

ప్రస్తుత పార్లమెంటరీ నియోజకవర్గాలే జిల్లాలుగా ఉండడంతో ఆ మేరకే అధ్యక్షులను ఆయా పార్టీలు నియమిస్తున్నాయి. అయితే తెలుగుదేశం మాత్రం వ్యవస్థాగతంగా అందరి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని, ఆపై తుది ప్రకటన చేయాలని భావిస్తోంది.ఈ కారణంగా పార్టీలో సమన్వయం, ఏకాభిప్రాయం సాధ్యం కావడమే కాక విభేదాలకు ఆస్కారం ఉండదని భావిస్తున్నారు. దీనిలో భాగంగా ముగ్గురు పరిశీలకులను ఖరారు చేసి, వారిని ఆయా జిల్లాల సమావేశాలకు పంపనున్నారు. ఏలూరు సమీపాన ఆదివారం ఒక కల్యాణ మండపంలో జరిగే సమావేశానికి ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి ఎమ్మెల్యేలు, కన్వీనర్లు, పార్టీ సీనియర్లు, కార్యకర్తలు, వివిధ హోదాల్లో ఉన్న వారు పాల్గొనాలని పార్టీ ఆదేశించింది. సమావేశంలో మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, బుద్దా నాగజగదీశ్‌లు, సీనియర్లు పాల్గొని అందరి నుంచి అభిప్రాయాలు సేకరిస్తారు. వాస్తవానికి పార్టీ జిల్లా అధ్యక్షుడిగా ఏ సామాజిక వర్గానికి చెందిన నేత ఉంటే బాగుంటుందో ఆరా తీస్తున్నారు. ఓసీ సామాజిక వర్గం నుంచి ప్రస్తుత జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులుకే (మిగతా 6వ పేజీలో)

బార్లకు దరఖాస్తులు కరువు

ఏలూరు, ఆగస్టు23(ఆంధ్రజ్యోతి):జిల్లాలో బార్‌ల లైసెన్సుల కోసం దరఖాస్తుదారుల నుంచి స్పందన కరువైంది. జిల్లాలో 18 బార్లకు సంబంధించి ఈనెల 18న నోటిఫి కేషన్ జారీ చేయగా ఐదో రోజు వరకు శనివారం నాటికి ఒక్కటి కూడా దాఖలు కాలేదు. బార్‌లపై ఆసక్తి ఉన్నా, చివరి రోజుల్లో అంటే ఈనెల 25,26వ తేదీల్లో దరఖాస్తులు దాఖలయ్యే అవకాశం ఉందని భావిస్తున్నారు. లాటరీ తీయడానికి కనీసం నాలుగు దరఖాస్తులు వస్తేనే తీయాలన్న నిబంధనతో నాన్ రిఫండబుల్ మొత్తం ఎక్కడ నష్టపోతామన్న ఆందోళనతో చివరి వరకు వేచి చూస్తున్నట్టు తెలుస్తోంది.

రెడీఎస్సీ

» రేపే.. మెగా డీఎస్సీకి ఎంపికైన అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన

» సెలెక్టెడ్ అభ్యర్థుల లాగిన్‌లకే కాల్ లెటర్లు

■ లోపలి పేజీలో..



విప్ నాయకర్‌కు వినతిపత్రం అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే బండారు, ప్రముఖులు

నరసాపురాన్ని జిల్లా కేంద్రం చేయాలి

» మాజీ ఎమ్మెల్యే బండారు ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ

నరసాపురం, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి):కొత్త జిల్లాల పునర్వ్యవస్థీకరణ ప్రక్రియకు ప్రభుత్వం శ్రీకారం చుట్టడంతో నరసాపురాన్ని జిల్లా కేంద్రం చేయాలంటూ స్థానికుల నుంచి డిమాండ్ వస్తోంది. ఈ మేరకు వైద్యులు, వ్యాపారులు, న్యాయవాదులు, విద్యా సంస్థల యజమానులు, వివిధ పార్టీల నాయకులు, కార్మికులు చేతులు కలిపారు. మాజీ ఎమ్మెల్యే బండారు మాధవ నాయుడు ఆధ్వర్యంలో శనివారం తొలి అడుగు వేశారు. రాయపేటలోని ఆయన నివాసం నుంచి జనసేన పార్టీ కార్యాలయం వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ విప్ నాయకర్‌ను కలిశారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన అన్యాయాన్ని ప్రభుత్వం, కమిటీ దృష్టికి తీసుకెళ్లి నరసాపురానికి న్యాయం జరిగేలా చూడాలని వినతిపత్రం అందించారు. బండారు మాట్లాడుతూ భౌగోళికంగా అన్ని అనుకూల పరిస్థితులు ఉన్నప్పటికీ గత ప్రభుత్వం ఏకపక్ష నిర్ణయం కారణంగా నరసాపురానికి అన్యాయం జరిగిందన్నారు. దీనికి మాజీ ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు ఓ కారణమని ఆరోపించారు. డాక్టర్ చినమిల్లి సత్యనారాయణ, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బూసి విశ్వేశ్వరరావు మాట్లాడుతూ జిల్లా కేంద్రం సాధించేందుకు పార్టీలను పక్కన బెట్టి ఐక్యంగా ముందుకు సాగుదామన్నారు. 'జిల్లా ఉద్యమంలో నేను పాల్గొన్నా. ప్రజల మనోభావాలు నాకు తెలుసు. దీని కోసం నా వంతు కృషి చేస్తా'నని విప్ నాయకర్ హామీ ఇచ్చారు. కమిటీ దృష్టికి తీసుకుని వెళదామన్నారు. డాక్టర్ కోటేశ్వరరావు, పోలిశెట్టి శ్రీనువాస్, పిండి ఆదినారాయణ, అందే సతీష్, కోటిపల్లి సురేష్, కూనపరెడ్డి రంగారావు, కొండేటి శ్రీను, బళ్ల వెంకటేశ్వరావు, కోటిపల్లి వెంకటేశ్వరావు, వలవల నాని, రేవు ప్రభుదాసు తదితరులు పాల్గొన్నారు.

29 నుంచి మంత్రివర్గ ఉపసంఘం పర్యటన

నూజివీడు, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి):జిల్లాల పునర్విభజనతోపాటు మండలాలు, రెవెన్యూ డివిజన్ సరిహద్దుల మార్పిడిపై ఏర్పడిన మంత్రివర్గ ఉప సంఘం ఈ నెల 29 నుంచి రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో పర్యటించనుంది. ఈ ఉపసంఘం జిల్లా కేంద్రాల్లో కలెక్టర్లు, ప్రజా ప్రతినిధులతో చర్చించడంతో పాటు ప్రజల నుంచి వినతి పత్రాలను స్వీకరిస్తుంది. సెప్టెంబరు 2వ తేదీ వరకు జిల్లా కలెక్టరేట్‌ల్లో ప్రజలు దరఖాస్తులు ఇవ్వవచ్చు. ప్రజల నుంచి వచ్చిన వినతులు ఆధారంగా సెప్టెంబరు 15 నాటికి ప్రభుత్వానికి ఉపసంఘం తన నివేదికను ఇస్తుంది. డిసెంబరు 31వ తేదీలోగా ఈ ప్రక్రియను పూర్తిచేయాలని ప్రభుత్వ లక్ష్యంగా పెట్టుకుంది. గన్నవరం నియోజకవర్గంలోని బాపులపాడు మండలం కొత్తపల్లి, బిళ్ళనపల్లి, మడిచర్ల, కొయ్యూరు గ్రామాలు నూజివీడు లేదా ముసునూరు మండలాల్లో కలపాలని వినతి పత్రాలు వెళ్లాయి. గతంలో ఇవి నూజివీడు మండల పరిధిలో ఉండేవి. నూజివీడు నియోజకవర్గాన్ని ఎన్టీఆర్ జిల్లాలో కలపాలని డిమాండ్ ఉంది.

రంగా విగ్రహాలకు అవమానం

» కలిదిండి, సానారుద్రవరంలో విగ్రహాలకు పేడ

» అభిమానుల ఆగ్రహం.. ధర్నా

» దుండగులను కఠినంగా శిక్షిస్తాం : సీఎం

■ లోపలి పేజీలో..

అర్హులకు పెన్షన్ రద్దు కాదు

» డీఆర్‌డీఏ పీడీ విజయరాజు

ఏలూరుసిటీ, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి):అర్హత కలిగిన ఏ ఒక్కరికి పెన్షన్ రద్దు కాదని డీఆర్‌డీఏ పీడీ ఆర్.విజయరాజు స్పష్టం చేశారు. ప్రభుత్వం ఈ విషయంపై ఎటువంటి నిర్ణయం తీసుకోలేద న్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఎన్టీఆర్ భరోసా పింఛన్ పథకంలో భాగంగా వికలాంగ పింఛన్ల పునఃపరిశీలనకు హాజరైన వారిలో అంగవైకల్యం 40 శాతం కంటే తక్కువగా ఉన్న వారికి మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, మున్సిపల్ కమిషర్ల ద్వారా గ్రామ/ వార్డు సచివాలయాల సిబ్బందితో నోటీసులు జారీ చేశారన్నారు. వారందరికీ అప్పీలు అవకాశం కల్పించామన్నారు.

పరిశుభ్రతతో సీజనల్ వ్యాధులకు చెక్

» మంత్రి పార్థసారథి



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కొలుసు

ఆగిరిపల్లి, ఆగస్టు 23, (ఆంధ్రజ్యోతి): పరిశుభ్రతతో సీజనల్ వ్యాధులకు చెక్ పెట్టవచ్చని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా శనివారం ఆగిరిపల్లి మండలం శోభనాపురం శివారు బొద్దానపల్లి పంచాయతీలో వీధులను శుభ్రం చేసి డ్రెయిన్లలో పూడికను తొలగించారు. అనంతరం జడ్పీ హైస్కూల్ ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ.. 'వ్యాధులకు మూలం అపరిశుభ్రత వాతావరణం. రాష్ట్ర ప్రభుత్వం ఏటా రూ.25 వేల కోట్లకు పైగా ప్రజారోగ్య పరిరక్షణకు ఖర్చు చేస్తోంది. పరిశుభ్రత ప్రతీ ఒక్కరి జీవితంలో భాగంగా కావాలి. పెన్షన్‌లకు ఏటా రూ.34 వేల కోట్లు ఖర్చు చేస్తున్నాం. రాష్ట్రంలో 65 లక్షల మంది విభిన్న ప్రతిభావంతులకు పెన్షన్లు అందిస్తున్నాం. దొంగ సర్టిఫికెట్లతో పెన్షన్లు పొందేవారిని గుర్తించేందుకు పరిశీలన కార్యక్రమం చేపట్టాం' అన్నారు. సబ్ కలెక్టర్ బొల్లిపల్లి వినూత్న మాట్లాడుతూ ప్రతీ నెలా మూడో శనివారం స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం చేపడుతున్నామన్నారు. బొద్దన్నపల్లిలోని పారిశుధ్య కార్మికులు సీతారాంబాబు, పేరంటమ్మలను మంత్రి సన్మానించి రూ.ఏడు వేలు బహుమతిగా అందజేశారు. ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రమాదవశాత్తూ మరణించిన వారి కుటుంబ సభ్యులకు బీమా సొమ్మును అందజేశారు. తహసీల్దార్ ప్రసాద్, ఎంపీడీవో భార్గవి, టీడీపీ మండల అధ్యక్షుడు నక్కనబోయిన వేణు, శోభనాపురం పీఏసీఎస్ చైర్మన్ నలజాల హరిబాబు, హెచ్‌ఎం యామిని కృష్ణ ప్రియ, తదితరులు పాల్గొన్నారు.


పరిశుభ్రత జిల్లాగా తీర్చిదిద్దుదాం : కలెక్టర్

కలిదిండి, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి):రాష్ట్రంలోనే పరిశుభ్రత జిల్లాగా ఏలూరు జిల్లాను తీర్చిదిద్దేం దుకు అంతా కలసికట్టుగా కృషి చేద్దామని కలెక్టర్ వెట్రిసెల్వి పిలుపునిచ్చారు. కలిదిండి జడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో కలెక్టర్ ఎమ్మెల్యే కామినేని శ్రీని వాస్‌తో కలసి మొక్కలు నాటారు. విద్యార్థులకు చేతులు శుభ్రత కార్యక్రమాన్ని పరిశీలించారు. మంచినీటి ఫిల్టరు పాయింట్లను పరిశీలించారు. పదో తరగతి విద్యార్థులకు స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర, మంచినీటి పరీక్షలపై కలెక్టర్ పాఠాలు చెప్పి సమాధానాలను రాబట్టారు. పారిశుధ్య కార్మికులకు సన్మానాలు చేశారు. విద్యార్థుల ర్యాలీని జెండా ఊపి ప్రారంభించి ర్యాలీలో పాల్గొన్నారు. ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ మాట్లాడుతూ భవిష్యత్ తరాల కోసం పర్యావరణాన్ని కాపాడాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఆర్డీవో ఎం.అచ్యుత అంబరీష్, జడ్పీ సీఈవో ఎం.శ్రీహరి, వ్యవసాయ శాఖ జేడీ షేక్ హబీబ్ బాషా, డీపీవో కె.అనురాధ, ఫిషరీష్ డీడీ బి.నరసయ్య, తహసీల్దార్ ఎం.రామకృష్ణ, ఎంపీడీవో ఆర్.ఫణీంద్ర, హెచ్‌ఎం బి.స్వర్ణకుమారి, సర్పంచ్ ఎం.మారుతి ప్రసన్న పాల్గొన్నారు.



వరద గండం తప్పింది

వేలేరుపాడు/కుక్కునూరు/పోలవరం,ఆగస్టు23(ఆంధ్రజ్యోతి): ఎగువన వరద ఉధృతి తగ్గడంతో తెలంగాణలోని భద్రాచలం వద్ద గోదావరి తగ్గుముఖం పట్టింది. వేలేరుపాడు మండలంలో శనివారం ఉదయం వరకు గ్రామాలను చుట్టుముట్టి ఉన్న వరద క్రమేపీ తగ్గుముఖం పడుతోంది.అయితే నీటమునిగిన రహదారులు ఇంకా బయటపడకపోవడంతో 23 గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఆదివారం ఉదయానికి పూర్తిస్థాయిలో వరద తగ్గుముఖం పట్టే అవకాశం ఉంది. కుక్కునూరు మండలంలో గుండేటి వాగు కాజ్‌వే వరద నీటి నుంచి బయటపడింది. ప్రస్తుతానికి వరదగండం తప్పడంతో కుక్కునూరు, వేలేరుపాడు మండలాల ప్రజలు ఊపిరి పీల్చుకుంటున్నారు. కాగా పశువుల దాణాకు ఇబ్బందిలేకుండా ముంపు గ్రామాల్లోని రైతుల పశువులకు ఎండుగడ్డిని సరఫరా చేయాలని కలెక్టర్ ఆదేశించడంతో పశుసంవర్థక శాఖ జేడీ డాక్టర్ గోవిందరాజులు 15 టన్నుల ఎండుగడ్డిని రైతులకు అందించారు. పోలవరం వద్ద గోదావరి నిలకడగా మారింది. ఎగువ కాఫర్ డ్యాం వద్ద వరద బ్యాక్ వాటర్ ప్రభావంతో అల్లూరి సీతారామరాజు మన్యం జిల్లా గొందూరు మాతృశ్రీ గండి పోశమ్మ ఆలయం నీటమునిగింది. దేవదాయశాఖ అధికారులు ఆలయానికి రాకపోకలు నిలిపివేశారు.



కటుకూరు వద్ద గోదావరి ఉధృతి



నీటమునిగిన గండి పోశమ్మ ఆలయం

రెడీఎస్సీ

» రేపే.. మెగా డీఎస్సీకి ఎంపికైన అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన
» ఎంపికైన అభ్యర్థుల లాగిన్‌లకే నేరుగా కాల్ లెటర్లు
» సీఆర్ రెడ్డి ఇంజనీరింగ్ కాలేజీలో విస్తృత ఏర్పాట్లు


మాట్లాడుతున్న డీఈవో వెంకట లక్ష్మమ్మ.. పాల్గొన్న ఎంఈవోలు, హెచ్‌ఎంలు

ఏలూరు అర్బన్, ఆగస్టు23(ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ ఉపాధ్యాయ అభ్యర్థులు చిరకాలంగా ఎదురుచూస్తోన్న మెగా డీఎస్సీ-2025 నియామకాల ప్రక్రియ దాదాపు ముగింపు దశకు చేరువైంది. డీఎస్సీ పరీక్షలు రాసిన అభ్యర్థుల మెరిట్ జాబితాలను సబ్జెక్టుల వారీగా విడుదల చేసిన విద్యాశాఖ తదుపరి సెలెక్టెడ్ అభ్యర్థుల యూజర్ ఐడీ, పాస్‌వర్డ్‌లతో కూడిన లాగిన్‌లకు సర్టిఫికెట్ల వెరిఫికేషన్ నిమిత్తం శనివారం రాత్రి లేదా ఆదివారం కాల్ లెటర్లను పంపడానికి ఏర్పాట్లు చేసింది. ఉమ్మడి జిల్లాలో మొత్తం 1,074 ఉపాధ్యాయ ఉద్యోగాల భర్తీకి విడుదలైన నోటిఫికేషన్ మార్గదర్శకాలకు లోబడి నియామకాలను పూర్తిచేసి, సెప్టెంబరు 5న కొత్త ఉపాధ్యాయులు విధుల్లో చేరేలా కసరత్తు జరుగుతోంది. సర్టిఫికెట్ల పరిశీలనకు సోమవారం ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పరిధిలోని ఏలూరు, పశ్చిమ, తూర్పు గోదావరి జిల్లాల 48 మండలాలు, మున్సిపాలిటీలు, ఏలూరు నగరపాలకసంస్థ యాజమాన్యాల టీచరు పోస్టులకు ఎంపికైన అభ్యర్థులు వట్లూరులోని సీఆర్‌రెడ్డి ఇంజనీరింగ్ కళాశాలకు హాజరుకావాల్సి ఉంది. సర్టిఫికెట్ల పరిశీలనలో ఎవరైనా అభ్యర్థులు అనర్హులుగా తేలితే వారిస్థానంలో తదుపరి మెరిట్ అభ్యర్థులను పిలుస్తారు. ధ్రువపత్రాల పరిశీలనలో పాటించాల్సిన మార్గదర్శకాలపై శనివారం సీఆర్‌ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఉమ్మడి జిల్లా డీఈవో, డీఎస్సీ కన్వీనర్ ఎం.వెంకటలక్ష్మమ్మ, పలు శాఖల జిల్లా అధికారులు, విద్యాధికారులకు పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. పశ్చిమ గోదావరి జిల్లా డీఈవో నారాయణ, అసిస్టెంట్ డైరెక్టర్లు అవధాని, వెంకటప్పయ్య, డీవైఈవోలు రవీంద్రభారతి, సుధాకర్, ఎంఈవో ఎస్.నరసింహమూర్తి పాల్గొన్నారు.

సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ఏర్పాట్లపై ముఖ్యాంశాలు..

పాఠశాల విద్యాశాఖ యాజమాన్యంలో మొత్తం 1,035 పోస్టులు, గిరిజన సంక్షేమశాఖ ఆశ్రం పాఠశాలల్లో 32 పోస్టులు, జువనైల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ స్కూల్స్‌లో ఏడు పోస్టులు కలిపి మొత్తం 1,074 ఉపాధ్యాయ ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్ సోమవారం ఉదయం 10 గంటల నుంచి ప్రారంభమవుతుంది. వెరిఫికేషన్ నిమిత్తం సీఆర్‌ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో 2 బ్లాకుల్లో 22 కౌంటర్లు, 44 ప్రత్యేక గదుల్లో ఏర్పాట్లు చేశారు. 3 స్టాండ్ బై కౌంటర్లు, 6 ప్రత్యేక గదులను సిద్ధంగా ఉంచారు. అన్నింటికీ ఇంటర్నెట్ కనెక్షన్లు ఏర్పాటు చేసి శనివారం ట్రయల్‌రన్ నిర్వహించారు.

- హాజరైన అభ్యర్థులకు అవగాహన నిమిత్తం కళాశాల గేటు వద్ద సెలక్షన్ జాబితాలను ప్రదర్శిస్తారు. సీనియార్టీ లిస్టు ప్రకారం అభ్యర్థులకు గేటువద్దే టోకెన్ ఇచ్చి లోపలికి పంపిస్తారు. అభ్యర్థితోపాటు ఒక సహాయకున్ని అనుమతిస్తారు. ప్రతీ 50 మంది అభ్యర్థులకు ఒక కౌంటర్ చొప్పున కేటాయించారు.
- ప్రతీ కౌంటర్‌లో ఒక ఎంఈవో, ఒక సీనియర్ హెచ్‌ఎం, ఒక డిప్యూటీ తహసీల్దార్, ఒక డేటా ఎంట్రీ ఆపరేటర్ ఉంటారు. ఈ కౌంటర్లన్నింటినీ పర్యవేక్షించేందుకు ఐదు టీమ్‌లుంటాయి. ఒక్కో టీమ్‌లో డీవైఈవో, సీనియర్ విద్యాధికారులుంటారు. ప్రభుత్వ నోడల్ ఆఫీసర్‌గా సమగ్రశిక్ష స్టేట్ అకడమిక్ మోనటరింగ్ ఆఫీసర్ నాగేశ్వరరావును ప్రభుత్వం నియమించింది.
- కౌంటర్ వద్దకు వచ్చిన అభ్యర్థినుంచి అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లు, మూడుసెట్ల అటెస్టెడ్ జిరాక్స్ కాపీలు తీసుకుని, వారివద్ద వున్న వివరాలతో సరిపోల్చుకుంటారు. వాటిని నిర్ణీత చెక్‌లిస్టులో నమోదు చేస్తారు. తదుపరి జిరాక్స్ కాపీల సెట్లను తీసుకుని, ఒరిజినల్స్ అభ్యర్థికి ఇచ్చేస్తారు. టీమ్ ఓకే అన్నవెంటనే చెక్‌లిస్టుని డీఈవోకు పంపిస్తారు. అక్కడ డీఈవో సంతకంచేసిన వెంటనే చెక్‌లిస్టుని వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయడంతో అభ్యర్థి సర్టిఫికెట్ల వెరిఫికేషన్ పూర్తవుతుంది.
- కళాశాల ప్రాంగణంలో పారిశుధ్యం, తాగునీరు, ప్రథమచికిత్స, నిరంతర విద్యుత్ సరఫరా, పోలీసు బందోబస్తు ఏర్పాట్లను సంబంధిత శాఖలు చేస్తున్నాయి. కులధ్రువీకరణ, స్థానికత ధ్రువీకరణ, వైకల్య ధ్రువీకరణ పత్రాల జెన్యూనిటీని పరిశీలించేందుకు రెవెన్యూ, సోషల్ వెల్ఫేర్, బీసీ వెల్ఫేర్, ట్రైబల్ వెల్ఫేర్, డిజేబుల్డ్ వెల్ఫేర్, సైనిక్ వెల్ఫేర్, ఐటీడీఏ, జువనైల్ డిపార్ట్‌మెంట్‌ల నుంచి అధికారులను నియమించారు. కళాశాల ప్రాంగణంలో రద్దీ సమస్య తలెత్తకుండా వ్యాయామోపాధ్యాయుల సేవలను వినియోగించుకుంటున్నారు.
- సెలెక్టెడ్ జాబితాలోవున్న అభ్యర్థులు వెరిఫికేషన్‌కు సంబంధించి ఏదైనా సమాచారం కోసం హెల్ప్‌లైన్/హెల్ప్‌డెస్క్ నంబర్లు 90307 23444 (సీనియర్ అసిస్టెంట్ సుధాకర్), 95056 44555(ఏఎస్‌వో అక్బర్)లను సంప్రదించవచ్చు. అభ్యర్థులు, వారి సహాయకులకు అల్పాహారం, భోజన సౌకర్యం నిమిత్తం కళాశాల క్యాంటీన్ నిర్వాహకులకు సమాచారమిచ్చారు. నిర్ణీత ధర చెల్లించి వాటిని పొందవచ్చు.

రాచూరు వేణుమాధురికి మూడు ర్యాంకులు



ఉంగుటూరు,ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : రాచూరు గ్రామ నివాసి వత్రపు వేణుమాధురికి శనివారం ప్రకటించిన మెగా డీఎస్సీ ఫలితాలు-2025లో మూడు ర్యాంకులు సాధించింది. తల్లిదండ్రులు వత్రపు మోహనరెడ్డి, శ్రీలక్ష్మి దంపతులు ఇరువురూ ఉపాధ్యాయులు కావడంతో వారి స్ఫూర్తితో పాటు తన అక్క చందన ప్రభుత్వ ఉపాధ్యాయరాలు కావడం విశేషం. ప్రస్తుతం తాడేపల్లిగూడెం పట్టణంలో నివాసముంటున్న ఆమె టీజీటీ జోనల్‌లో మొదటి ర్యాంకును సాధించింది. స్కూల్ అసిస్టెంట్ బయాలజీ పరీక్షల్లో జిల్లాలో 11వ ర్యాంకు, సెకండరీ గ్రేడ్ పరీక్షల్లో జిల్లా 17వ ర్యాంకు సాధించింది. తనకు బయాలజీ సబ్జెక్టు అంటే ఇష్టమని అందుకే ఈ సబెక్టులో కొలువు కోసం ప్రయత్నిస్తున్నాన్నారు. ఆమె డీఎడ్ దూబచర్ల డైట్ కళాశాలలోను, బీఈడీ విద్య వాసవి కళాశాలలోను చదివింది. ఒకే డీఎస్సీలో మూడు ర్యాంకులు సాధించడం అభినందనీయం. తల్లి శ్రీలక్ష్మి కస్పాపెంటపాడు స్కూలులో పనిచేస్తుండగా తండ్రి మోహనరెడ్డి నిడమర్రు మండలం చిననింద్రకొలను హైస్కూలులో ఉపాధ్యాయుడిగా కొనసాగుతున్నారు.

సరస్వతీ పుత్రులు

మెగా డీఎస్సీ-2025లో మెరిసిన మా'స్టార్లు'

పరసా హరీశ్‌కు రెండు, పది ర్యాంకులు



ద్వారకాతిరుమల : వేంపాడుకు చెందిన పరసా హరీశ్ ఎస్ఏ మ్యాథ్స్ విభాగంలో జిల్లాలో 85.53963 స్కోరు సాధించి రెండో ర్యాంకు పొందాడు. మూడు జిల్లాల జోన్ స్థాయిలో పీజీటీ, టీజీటీలలో వరుసగా72.5, 76.0013 స్కోర్లతో రెండు, పది ర్యాంకులు సాధించి సత్తా చాటాడు. గ్రామంలోని యూపీ స్కూల్‌లో ఏడో తరగతి వరకు, పంగిడిగూడెం హైస్కూల్‌లో పది వరకు చదివాడు. ఇంటర్‌ను ద్వారకాతిరుమలలోని ఓ జూనియర్ కాలేజీలో పూర్తిచేశాడు. ఇక ఏలూరులోని సీఆర్‌ఆర్ కళాశాలలో చదివిన బీఎస్సీలో 9.65 జీపీఏ సాధించి గోల్డ్ మెడల్ పొందాడు. అదే కాలేజీలో బీఈడీ పూర్తి చేశారు. ఎమ్మెస్సీ మ్యాథ్స్‌ను ఆంధ్రా యూనివర్సిటీ, దూరవిద్య ద్వారా చదివి ఇటీవల పూర్తి చేశారు. తండ్రి సత్యనారాయణ వ్యవసాయం, తల్లి వరలక్ష్మి గృహిణిగా ఉన్నారు.

కొండ్రు సురేశ్‌కు నాలుగు ర్యాంకులు



భీమవరంటౌన్ : మెగా డీఎస్సీలో ఒకే నోటిఫికేషన్‌లో నాలుగు పోస్టులను భీమవరానికి చెందిన కొండ్రు సురేష్ బాబు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. జిల్లా స్థాయిలో పీఈటీలో రెండో స్థానం, జోనల్ స్థాయి పీడీ పోస్టుకు 12వ స్థానం, ఎస్ఏ(పీఈ)లో 41వ స్థానంతో పాటు స్పోర్ట్స్ కోటా ద్వారా ఎస్‌జీటీకి ఎంపికయ్యారు. శనివారం యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో జిల్లా శాఖ తరఫున ఎంఎల్‌సీ బి.గోపిమూర్తి, జిల్లా అధ్యక్షుడు విజయరామరాజు, తదితరులు సన్మానించారు.

వెలగల రమ్యశ్రీకి మూడు ర్యాంకులు



పెనుమంట్ర : మెగా డీఎస్సీలో మూడు విభాగాల్లో మార్టేరుకు చెందిన గృహిణి వెలగల రమ్యశ్రీ సాధించి, తన ప్రతిభను చాటుకుంది. స్కూల్ అసిస్టెంట్ కేటగిరీలో స్టేట్ 8వ ర్యాంక్, (జిల్లాలో 2వ ర్యాంక్), పీజీటీ కేటగిరిలో 87.43 శాతం మార్కులతో 4వ ర్యాంక్, టీజీటీలో జోన్‌లో నాలుగో ర్యాంక్ లభించింది. ఈ విజయం స్ఫూర్తితో గ్రూప్స్ పరీక్షలు రాసి మంచి ప్రభుత్వ కొలువు సాధించడం లక్ష్యం అన్నారు.

పెదనింద్రకొలనులో ఇద్దరికి ర్యాంకులు


కమ్మిల అనిత ఆనందమణి చినిమిల్లి గాయిత్రి దుర్గ

నిడమర్రు : పెదనింద్రకొలను ఉన్నత పాఠశాలలో విద్యనభ్యసించిన కమ్మిల అనిత ఆనందమణి ఎస్‌జీటీలో జిల్లా 50వ ర్యాంకు సాధించింది. తల్లిదండ్రులు సీతారామయ్య, వీరవేణి సాధారణ మధ్య తరగతి కుటుంబం. ఆమె టెన్త్‌లో స్కూల్ టాపర్‌గా నిలిచి అనంతరం ఐఐటీ నూజివీడులో విద్యనభ్యసించి, డైట్ దూబచర్లలో డీఎడ్ పూర్తిచేశారు.

● పెదనింద్రకొలను గ్రామానికి చినిమిల్లి రాంబాబు రత్నకుమారి కుమార్తె గాయిత్రీదుర్గ టెన్త్ వరకు ప్రభుత్వ పాఠశాలలో చదివి అనంతరం కుటుంబ పరిస్థితుల నేపథ్యంలో దూరవిద్య ద్వారా ఇంటర్, దూబచర్ల డైట్ కాలేజీలో డీఎడ్ పూర్తి చేసి డీఎస్సీలో 137వ ర్యాంకు సాధించింది.

ప్రసన్నలక్ష్మికి హిందీ పండిట్‌లో జిల్లా సెకండ్



మొగల్తూరు : మొగల్తూరుకు చెందిన డి.ప్రసన్నలక్ష్మి హిందీ పండిట్ ట్రైనింగ్ పూర్తి చేసింది. డీఎస్సీ పరీక్షలో గ్రేడ్ వన్ హిందీ పండిట్ పరీక్ష రాసి జిల్లాస్థాయి సెకండ్ ర్యాంకు సాధించింది. ఈమేరకు భర్త మురళీ మొగల్తూరు పోస్టల్ కార్యాలయంలో ఒప్పంద ప్రాతిపదికన పోస్ట్‌మన్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు.

వెంకటకృష్ణకు నాలుగు ర్యాంకులు



కాళ్ల : పెద అమిరానికి చెందిన సూర్యప్రకాష్, కనకదుర్గ దంపతులకు పెద్ద కుమారుడైన బూరాడ వెంకటకృష్ణ ఒకేసారి నాలుగు ర్యాంకులతో ఉద్యోగాలకు అర్హత సాధించాడు. స్కూల్ అసిస్టెంట్- మ్యాథ్స్‌లో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో 8వ ర్యాంకు, జోనల్ 2వ స్థాయి ఉద్యోగాలైన టీజీటీ మ్యాథ్స్‌లో 6వ ర్యాంక్, పీజీటి మ్యాథ్స్‌లో 24వ ర్యాంక్, రాష్ట్రస్థాయి ప్రిన్సిపాల్ పోస్టుకుగాను 56వ ర్యాంక్ సాధించాడు. అతడి భార్య వరలక్ష్మి వేంపాడు గ్రామంలో ఎంపీపీ పాఠశాలలో సెకండ్ గ్రేడ్ టీచర్‌గా పని చేస్తున్నారు. వెంకట కృష్ణ మాట్లాడుతూ పక్కా ప్రణాళికతో మూడు నెలల పాటు రోజుకి 18 గంటల చొప్పున చదివానని తెలిపారు.

వెంకటలక్ష్మికి ఎస్ఏలో రెండో ర్యాంకు



పాలకోడేరు : పెన్నాడ గ్రామానికి చెందిన నడిపిల్లి వెంకట త్రిమూర్తులు కుమార్తె వెంకటలక్ష్మి స్కూల్ అసిస్టెంట్ సోషల్ స్టడీస్‌లో ద్వితీయ స్థానం సాధించింది. వెంకట త్రిమూర్తులు టైలరింగ్ చేస్తూ ఇద్దరు కుమార్తెలను కష్టపడి చదివించారు. రెండో కుమార్తె విజయవాడ వద్ద సబ్ పోస్ట్ మాస్టర్‌గా ఉద్యోగం సాధించింది. మొదటి కుమార్తె 2018లో డీఎస్సీలో తృటిలో ఉద్యోగాన్ని కోల్పోయింది. ఆ నాటి నుంచి లాంగ్ టర్మ్ కోచింగ్ తీసుకుంటూ మెగా డీఎస్సీలో రెండో ర్యాంకు సాధించడానికి నాన్నే కారణం అన్నారు. ఈ విజయం నాన్నకు అంకితమని తెలిపారు. ఒకటి నుంచి ఐదో తరగతి వరకు పెన్నాడ ఎలిమెంటరీ స్కూల్, 6 నుంచి 10వ తరగతి వరకు శృంగవృక్షం జిల్లా పరిషత్ హైస్కూల్, ఇంటర్మీడియెట్, డిగ్రీ భీమవరంలోని కళాశాలల్లో, బీయీడీ నరసాపురం వైఎన్ కళాశాలలో చదివాను. స్కూల్ ఉపాధ్యాయుడిగా పని చేయాలన్నది చిన్ననాటి కోరిక అని తెలిపారు.


కవిలేశ్వర వెంకటేశ్వరరావు కంభపు ప్రశాంత్ దల్లి సుబ్రహ్మణ్యం గోళ్ళ బాల గంగాధరరావు

లక్కవరంలో డీఎస్సీ ర్యాంకుల హవా

జంగారెడ్డిగూడెం : జంగారెడ్డిగూడెం మండలం లక్కవరం గ్రామంలో ఆరుగురు మెగా డీఎస్సీలో ఉత్తమ ర్యాంకులు సాధించారు. కవిలేశ్వర వెంకటేశ్వరరావు ఎస్ఏ తెలుగులో జిల్లా ప్రథమ స్థానం పొందగా, దల్లి సుబ్రహ్మణ్యం ఎస్ఏ తెలుగులో జిల్లా నాలుగో ర్యాంకు, గోళ్ళ బాల గంగాధర్ తిలక్ ఎస్ఏ తెలుగులో జిల్లా ఏడో ర్యాంకు, గురవాయిగూడెం గ్రామానికి చెందిన కంభపు నరేష్ ఎస్ఏ తెలుగులో జిల్లా 29వ ర్యాంకు, దల్లి రామాంజనేయులు ఎస్ఏ తెలుగులో 49వ ర్యాంకు సాధించారు. వీరంతా కొవ్వూరులోని వందేళ్ల చరిత్ర కలిగిన ఆంధ్ర గీర్వాణ విద్యాపీఠం కళాశాలలో బీఏ ఓఎల్ (తెలుగు)లో శిక్షణ పొందారు. వీరితో పాటు లక్కవరంలో కంభపు ప్రశాంత్ హిందీ పండిట్‌లో జిల్లా 17వ ర్యాంకు, ఎస్‌జీటీ,పీఈటీ పోస్టులను పొందారు.

ఐదు సార్లు డీఎస్సీ రాశా..

2008 నుంచి ఇప్పటివరకు ఐదు సార్లు డిఎస్సీ రాశా. 2025లో కల నెరవేరింది. ఇటుక బట్టీల్లో మా నాన్నకు ఇటుకలు తీయడంలో సహకరిస్తూనే కోచింగ్ లేకుండా జిల్లా ప్రథమ స్థానం పొందడం సంతోషంగా ఉంది. నా భార్య 2008లోనే డీఎస్సీ రాసి ఎస్ఏ, పీఎస్‌లో ఉద్యోగం పొందారు. మా చిన్నాన్న తెలుగు టీచర్. ఆయనే నాకు స్ఫూర్తి.

-కె.వెంకటేశ్వరరావు, ఎస్ఏ తెలుగు, జిల్లా ప్రథమ ర్యాంకు

చాలా సంతోషంగా ఉంది.

మాది నిరుపేద కుటుంబం. నాన్న చనిపోయారు.. తల్లి రామకుమారి పదో తరగతి వరకు చదివిచింది. ఇల్లు గడవక మెకానిక్ షెడ్డులో పనిచేస్తుండగా మా హిందీ టీచర్ సుధాకరరెడ్డి తనను ప్రోత్సహించి తన సొంత ఖర్చులతో కొయ్యలగూడెం సాకేత్ కళాశాలలో హిందీ పండిట్ చదివించారు. 2025 డీఎస్సీకి విజయనగరంలోని హిందీ విద్యామందిర్‌లో కోచింగ్ తీసుకున్నా.

- కంభపు ప్రశాంత్, హిందీ పండిట్, 17 వ ర్యాంకు


ప్రత్తిపాడు సరస్వతి విద్యాలయ్ పాఠశాలలో యోగా పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

యోగారోగ్యం

ప్రత్తిపాడు సరస్వతి విద్యాలయ్‌లో రాష్ట్రస్థాయి యోగా పోటీలు

» రాష్ట్ర నలుమూలల నుంచి 500 మంది విద్యార్థుల హాజరు

పెంటపాడు, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): నేటి సమాజంలో చాలామంది షుగర్, బీపీ వంటి దీర్ఘకాలిక రోగాలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఒకసారి మొదలైతే జీవితం మొత్తం మందులు వాడాల్సిందే. ఈ తరుణంలో దీర్ఘకాలిక రోగాలకు యోగా ఒక దివ్య ఔషధంలా పనిచేస్తుందని యోగా నిపుణులు చెబుతున్నారు. ప్రస్తుత సమాజంలో ప్రతిఒక్కరూ రోజూ కొంతసమయాన్ని యోగా లేదా వ్యాయామానికి కేటాయించాలని సూచిస్తున్నారు. పెంటపాడు మండలంలోని ప్రత్తిపాడు సరస్వతి విద్యాలయ్ పాఠశాలలో యోగాసన స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆరో లెవెల్ రాష్ట్రస్థాయి యోగా పోటీలు నిర్వహిస్తున్నారు. పాఠశాల ఛైర్మన్ కొలనువాడ వెంకట హనుమ సత్యనారాయణరాజు పర్యవేక్షణలో జరుగుతున్న పోటీలకు రాష్ట్రం నలుమూలల నుంచి సుమారు 500 మంది విద్యార్థులు హాజరయ్యారు. వీరిలో యోగా పలు విభాగాలలో కొంతమందిని విజేతలుగా ప్రకటిస్తారు. విజేతలు నేషనల్ లెవెల్ యోగా పోటీలలో పాల్గొంటారు. ఈనెల 21 నుంచి మొదలైన రాష్ట్రస్థాయి యోగా పోటీలు ఆదివారంతో ముగియనున్నాయి. ఈ సందర్భంగా పోటీల్లో పాల్గొన్న పలువురు విద్యార్థులు వారి మనోభావాలను ఆంధ్రజ్యోతితో పంచుకున్నారు.

యోగా అంటే చాలా ఇష్టం



నా పేరు సత్యప్రసాద్‌రాజు. నేను బీటెక్ చదువుతున్నాను. చిన్నతనం నుండి యోగా చదువుతో పాటూ యోగా కూడా ప్రాక్టీస్ చేస్తున్నాను. నాకు యోగా అంటే చాలా ఇష్టం. ఇందులో కొత్త కొత్త ఆసనాలు చాలా ఆసక్తిగా నేర్చుకుంటాను. ఎంత కష్టమైన ఆసనమైనా వదిలిపెట్టకుండా నేర్చుకున్నాను. ఆరోగ్యాన్ని కాపాడుకోవాలంటే తప్పనిసరిగా యోగా చేయాలి

- సత్యప్రసాద్‌రాజు, విజయవాడ

19 ఏళ్ల నుంచి యోగా చేస్తున్నా



మాది నెల్లూరు. ఎంబీఏ చదువుతున్నా. యోగాలో ఎంఎస్సీ చేస్తున్నా. చిన్నతనం నుంచి 19 ఏళ్లగా యోగా ప్రాక్టీస్ చేస్తున్నా. ఇప్పటివరకు అనేక ప్రదర్శనలు ఇచ్చాను. చాలా మెడల్స్ సంపాదించా. మా ఇంటివద్ద నాతో ఉండే వారందరికి యోగా శిక్షణ ఇస్తున్నా.

- ఎస్. లీనా, నెల్లూరు

ఆరోగ్యానికి యోగా తప్పనిసరి



రాష్ట్రస్థాయి యోగాసన పోటీల్లో మెరుగైన ప్రతిభ కనబర్చిన విద్యార్థులు నేషనల్ లెవెల్‌కు చేరుకుంటారు. అక్కడ కూడా ప్రతిభ కనబరిస్తే ఆసియా, ఒలింపిక్స్‌లో పాల్గొనే అవకాశం ఉంది. యోగాను స్పోర్ట్స్‌గా మార్చిన తరువాత ఉద్యోగాలలో కూడా కేంద్రప్రభుత్వం రాయితీ కల్పించింది. ప్రస్తుత సమాజంలో సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలంటే వయసుతో సంబంధం లేకుండా ప్రతీ రోజు యోగా తప్పనిసరిగా చేయాలి.

- కె.రామకృష్ణ, యోగా నేషనల్ కోచ్

మానసిక సమస్యలు జయించవచ్చు



యోగా చేయడం వల్ల దీర్ఘకాలికరోగాలు బీపీ, షుగర్, థైరాయిడ్, ఒబిసిటీ తదితర రోగాలను నియంత్రణ చేసుకోవచ్చు. అటువంటి రోగాలకు యోగా సాధన ద్వారా బయట పడే అవకాశం ఉంది. మానసిక సమస్యలు భయం, పిరికితనం, ఒత్తిడి , ఆందోళన తదితర సమస్యలను జయించవచ్చు.

- దేమర్ల దుర్గారావు, యోగాసన స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ కార్యదర్శి

ఆసియా యోగా పోటీలే లక్ష్యం



నేను ఎంబీఏ చదువుతున్నా. యోగాలో గుంటూరు ఆచార్య యూనివర్సిటీలో పీజీ డిప్లమో చేస్తున్నా. గత మూడేళ్లగా యోగాలో శిక్షణ తీసుకుంటున్నా. ఇప్పటివరకు ఎన్నో పోటీలలో పాల్గొన్నా. ప్రస్తుతం జరుగుతున్న ఏపీ రాష్ట్రస్థాయి యోగా పోటీలలో మొదటిస్థానంలో నిలిచా.. చాలా ఆనందంగా ఉంది. ఎప్పటికైనా ఇండియా తరపున ఆసియా యోగా పోటీలలో పాల్గొని విజయం సాధించడమే లక్ష్యం..

- కె.కార్తిక ఉషశ్రీదుర్గ, తణుకు

యోగాలో మెరుగైన ప్రతిభ కనబరుస్తా



మూడేళ్ల నుంచి యోగా ప్రాక్టీస్ చేస్తున్నా. విజయవాడలో ఇంటర్ సెకండ్ ఇయర్, బీకాం కంప్యూటర్స్ చదువుతున్నా. రెండుసార్లు నేషనల్ యోగా పోటీల్లో పాల్గొన్నా.. కానీ విజయం వరించలేదు. గత ఏడాది ఒక పాయింట్‌లో ప్లేస్ సాధించలేకపోయా. యోగాలో మెరుగైన ప్రతిభ కనపర్చాలనేది లక్ష్యం

- పి.షాలెంరాజు, పల్నాడు

యోగాలో ఎంఎస్సీ చేయడమే లక్ష్యం



మాది ఎన్టీఆర్ జిల్లా కొడవటికల్లు గ్రామం. ఇంజనీరింగ్ నాలుగో సంవత్సరం చదువుతున్నా. ఇంటర్మీడియెట్ నుంచి యోగా ప్రాక్టీస్ చేస్తున్నా. ఇప్పటికి ఆరేళ్లుగా శిక్షణ తీసుకుంటున్నా.. ఇప్పటికి మూడు సార్లు నేషనల్ యోగాలో పాల్గొన్నాను. భవిష్యత్తులో యోగాలో ఎంఎస్సీ చేయాలనేది లక్ష్యం.

- టి.అశోక్, కొడవటికల్లు, ఎన్టీఆర్ జిల్లా

యోగాతో మనస్సు ప్రశాంతం



మాది పల్నాడు జిల్లా చిలకలూరిపేట. నేను ఇంజనీరింగ్ మూడో సంవత్సరం చదువుతున్నా. యోగా చదువుకి అసలు ఆటంకం కాదు. యోగా చేయడం వల్ల మనసు ప్రశాంతంగా ఉంటుంది. బాగా చదువుకోవచ్చు. రెండేళ్ల నుంచి యోగా ప్రాక్టీస్ చేస్తున్నా. ఆసియా యోగా పోటీల్లో పాల్గొనడమే లక్ష్యం.

- సీహెచ్.మారుతీశ్రీనివాసరాజు, చిలకలూరిపేట, పల్నాడు జిల్లా


హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సుజాతకు స్వామి చిత్రపటాన్ని అందజేస్తున్న ఈవో మూర్తి


జస్టిస్ బి.కృష్ణమోహన్, వసంతలక్ష్మి దంపతులకు పండితాశీర్వాదం

వేంకటేశ్వరస్వామికి జస్టిస్ సుజాత ప్రత్యేక పూజలు

ద్వారకాతిరుమల, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): ఏలూరు జిల్లాలో ప్రముఖ పుణ్య క్షేత్రమైన ద్వారకాతిరుమల శ్రీవారి ఆలయాన్ని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వడ్డిబోయన సుజాత శనివారం సందర్శించారు. ఆలయానికి కుటుంబ సమేతంగా విచ్చేసిన ఆమెకు అర్చకులు, దేవస్థానం అధికారులు ఆలయ మర్యాదలతో పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. ముందుగా అర్చకులు, పండితుల వేదమంత్రోచ్చరణల నడుమ ఆలయ ప్రాంగణంలో ఆమె ప్రదక్షిణలు నిర్వహించారు. అనంతరం బంగారువాకిలి నుంచి లోనికి వెళ్లి ఆలయ గర్భాలయంలో కొలువైన స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు జరుపుకున్నారు. అర్చకులు నుంచి వేద ఆశీర్వచనాన్ని, ఆలయ ఈవో ఎన్వీ సత్యన్నారాయణమూర్తి ఆమెకు స్వామి, అమ్మవార్ల చిత్రపటాన్ని, ప్రసాదాలను అందజేశారు.

క్షీరా రామంలో జస్టిస్ కృష్ణమోహన్ దంపతుల పూజలు

పాలకొల్లు అర్బన్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): పాలకొల్లు క్షీరా రామలింగేశ్వర స్వామిని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.కృష్ణమోహన్, వసంతలక్ష్మి దంపతులు శనివారం దర్శించుకున్నారు. ఆలయ మర్యాదలతో అధికారులు, అర్చకులు వారికి పూర్ణ కుంభస్వాగతం పలికారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు, అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు. అనంతరం న్యాయమూర్తి దంపతులకు అర్చక స్వాములు వేదాశీర్వచనం గావించారు. ఈ సందర్భంగా వారికి స్వామివారి శేష వస్త్రాన్ని, చిత్రపటాన్ని అందజేశారు.

శ్రీవారి ఆలయ భక్తుల రద్దీకి అమావాస్య ఎఫెక్ట్


తూర్పు రాజగోపురం వద్ద తగ్గిన భక్తుల సందడి

ద్వారకాతిరుమల,ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): ద్వారకాతిరుమల వేంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తుల రద్దీపై అమావాస్య ఎఫెక్ట్ కనిపించింది. చినవెంకన్న ఆలయానికి ప్రతీ శనివారం వేలాది సంఖ్యలో భక్తులు తరలివస్తారు. దాదాపు ఇరవై వేలమంది వరకు భక్తులు ఆలయానికి వచ్చి స్వామి, అమ్మవార్లను దర్శించుకుంటారు. అమావాస్య కారణంగా తక్కువ సంఖ్యలో భక్తులు క్షేత్రానికి విచ్చేశారు. ఆలయంలోని అన్ని విభాగాలు సాధారణ భక్తుల రద్దీ కూడా కానరాలేదు. ఆలయానికి వచ్చిన వందల మంది భక్తులు క్యూలైన్లలో వెళ్లి స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆ తరువాత స్వామివారి అన్నప్రసాదం స్వీకరించారు. కేవలం 37 జంటలు శ్రీవారి నిత్య అర్జితకల్యాణంలో పాల్గొన్నారు.

మొరాయించిన పోలీస్ జీప్


పోలీస్ జీప్‌ను పక్కకు జరుపుతున్న సిబ్బంది

తణుకు రూరల్, అగస్టు 23 (ఆంధ్రజ్యోతి): శాంతి భద్రతలను కాపాడే పోలీసుల వాహనాలు మొరాయించడంతో సిబ్బంది సతమతమవుతున్నారు. తణుకు రూరల్ పోలీస్‌స్టేషన్‌కు సంబంధించిన పాతకాలపు జీప్‌తోనే సిబ్బంది తమ విధులను నిర్వర్తిస్తున్నారు. శుక్రవారం రాత్రి పోలీస్ సిబ్బంది గస్తీలో భాగంగా స్టేషన్ నుంచి బయలు దేరి తణుకు-తేతలి వై.జంక్షన్‌కు వచ్చేసరికి జీప్ ఆకస్మికంగా ఆగిపోయింది. మోటారు మెకానిక్‌ల కోసం ప్రయత్నించినా ఫలితం లేకపోవడంతో రాత్రంతా జీప్‌ను రోడ్డుపైనే వదిలేసి వెళ్లిపోయారు. శనివారం మనుషుల సహాయంతో జీప్‌ను రోడ్డు పక్కకు జరిపారు. రాష్ట్రంలో పోలీసులకు బొలేరో వంటి వాహనాలు అందుబాటులో ఉన్నప్పటికీ తణుకు వంటి ప్రాంతాల్లో పాతకాలపు జీప్‌లతోనే నెట్టుకు వస్తుండడం ఏమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న హీరో విజయరామరాజు

క్రీడా స్ఫూర్తిని చాటే 'అర్జున్ చక్రవర్తి'

భీమవరం టౌన్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): ఒక సాధారణ యువకుడు ఎన్ని కష్టాలనైనా ఎదుర్కొని దేశం గర్వించే గొప్ప క్రీడాకారుడిగా ఎదుగుతాడన్న కథాంశంతో క్రీడా స్ఫూర్తిని చాటేలా 'అర్జున్ చక్రవర్తి' చిత్ర నిర్మాణం సాగిందని చిత్రం యూనిట్ పేర్కొంది. త్వరలో విడుదల కానున్న అర్జున్ చక్రవర్తి చిత్రం యూనిట్ సినిమా ప్రమోషన్‌లో భాగంగా శనివారం ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాలకు విచ్చేసింది. ఈ ప్రాంతానికి చెందిన నిర్మాత గుబ్బల శ్రీను నిర్మాణ పర్యవేక్షణలో చిత్ర బృందానికి కళాశాలలో ఘన స్వాగతం లభించింది. చిత్ర బృందాన్ని కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం. జగపతి రాజు, ప్రిన్సిపాల్ డాక్టర్ కేవీ మురళీకృష్ణ రాజు, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ సీహెచ్ దిలీప్ చక్రవర్తి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా హీరో విజయ్ రామరాజు మాట్లాడుతూ భీమవరం ప్రాంతానికి చెందిన తాను ఎంతో కష్టపడి డ్యూప్ లేకుండా నటించానని, చిత్రం విద్యార్థులకు నచ్చుతుందన్నారు. ఈ నెల 29న స్పోర్ట్స్ డే సందర్భంగా చిత్రం విడుదలకు సన్నాహాలు చేస్తున్నామని తెలిపారు. విద్యావేత్త గుబ్బల తమ్మయ్య, డాక్టర్ వి. చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు. దర్శకుడిగా విక్రాంత రుద్ర, మ్యూజిక్ డైరెక్టర్‌గా భాస్కరన్ వ్యవహరిస్తున్నారు. హీరోయిన్‌గా కేరళకు చెందిన సిజరోజ్, ఇతర పాత్రల్లో దయానంద రెడ్డి, దుర్గేష్ నటించినట్లు నిర్మాత గుబ్బల శ్రీను చెప్పారు.



ములగలంపాడు ఎరువుల దుకాణంలో అధికారుల తనిఖీలు

విజిలెన్స్ దాడులు.. ఎరువుల సీజ్

ఏలూరు: రీజనల్ విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి పి. మహేష్ ఆదేశాల మేరకు ఉమ్మడి జిల్లాలో పలుచోట్ల విజిలెన్స్, రెవెన్యూ, వ్యవసాయ శాఖాధికారులు విస్తృతంగా ఎరువుల దుకాణాలపై దాడులు నిర్వహించారు. పెంటపాడులో శ్రీ లక్ష్మి ఫెర్టిలైజర్స్ దుకాణంలో రూ. 1 లక్షా 49 వేల 53 విలువైన 11.490 టన్నుల ఎరువుల వ్యత్యాసాన్ని గుర్తించి సీజ్ చేశారు. లింగపాలెం మండలం ములగలంపాడులో విజయదుర్గా ట్రేడర్స్‌లో రూ. 5 లక్షల 87 వేల 50 విలువైన 19.55 టన్నుల ఎరువుల తేడాను గుర్తించి సీజ్ చేశారు. పాలకొల్లు మండలం శివదేవుని చిక్కాలలో దుర్గా శ్రీనివాస్ ఏజెన్సీలో రూ. 25 వేల 317 విలువైన 4.275 టన్నులు, భగ్గేశ్వరంలో లక్ష్మి ఫెర్టిలైజర్స్‌లో 21 వేల 053 విలువైన 3.555 టన్నుల ఎరువుల వ్యత్యాసాలను గుర్తించి సీజ్ చేశారు. ఈ తనిఖీల్లో ఇన్‌స్పెక్టర్ పి. శివరామకృష్ణ, విజిలెన్స్ ఏవోలు జీ మీరయ్య, పి. శ్రీధర్, విజిలెన్సు ఎస్ఐ సీహెచ్ రంజిత్‌కుమార్, కె నాగరాజు, పెంటపాడు, లింగపాలెం, పాలకొల్లు మండల వ్యవసాయాధికారులు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

సొసైటీల్లో యూరియా నిల్వల తనిఖీ

పోలవరం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గూటాలలో ఎరువుల కొరతపై శుక్రవారం రైతులు ఆందోళన జరిపిన నేపథ్యంలో శనివారం కో-ఆపరేటివ్ జిల్లా అధికారి ఎ. శ్రీనివాసరావు, జిల్లా విభాగ సహకార అధికారి ఎస్. సత్యవతి ఐదు సొసైటీల్లో యూరియా నిల్వలను తనిఖీ చేశారు. సొసైటీ నిర్వాహకులు ఎరువులు సక్రమంగానే పంపిణీ చేసినప్పటికీ తగినంత నిల్వలు అందుబాటులో ఉంచకపోవడం వల్ల సమస్య తలెత్తిందని మండల వ్యవసాయ అధికారి కె. రాంబాబు, కో-ఆపరేటివ్ జిల్లా అధికారులకు తెలిపారు. రైతులు ఎరువుల కోసం ఆందోళన చెందవద్దని, 256 మెట్రిక్ టన్నులు ఐదు సొసైటీలకు త్వరలోనే ఏర్పాటు చేస్తామని అధికారులు తెలిపారు.

ప్రి స్కూళ్లలో నమోదు పెంచాలి

పెనుగొండ, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మహిళా శిశు సంక్షేమ శాఖ రీజనల్ జాయింట్ డైరెక్టర్ బి. సుజాతారాణి అన్నారు. పెనుగొండ మండలం సిద్ధాంతంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఆహారాన్ని రుచి చూశారు. ప్రి స్కూలు నమోదు పెంచాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలన్నారు. కేంద్రాల్లో ప్రి స్కూలు కార్యక్రమాలను, రిజిస్టర్లు, రికార్డులను పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇచ్చే సరుకులు ఏ విధంగా ఉన్నాయి... ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. గర్భవతులకు పలు సూచనలు చేశారు. స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. సీడీపీవో ఎ. కృష్ణకుమారి, సూపర్‌వైజర్ రూతు కుమారి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

'కుల ధ్రువీకరణ పత్రాల కోసం ఒత్తిడి సరికాదు'

భీమవరం టౌన్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): సుమోటో క్యాస్ట్ సర్టిఫికెట్ల విషయంలో వీఆర్వోలపై అధికారుల ఒత్తిడి సరికాదని గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భూపతిరాజు రవీంద్ర రాజు ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వంలో సరైన వివరాలు లేకుండా కేవలం పేర్లు మాత్రమే పంపి వారి వివరాలు సేకరించి సర్టిఫికెట్లు ఇవ్వాలని తమపై ఒత్తిడి రాగా అప్పుడు తాము తీవ్రంగా ఖండించామన్నారు. క్యాస్ట్ సర్టిఫికెట్ కావాలనుకునే వారు నేరుగా వారి ఆధారాలతో సచివాలయంలో దరఖాస్తు చేస్తే సర్టిఫికెట్లు వెంటనే ఇస్తామన్నారు. తప్పుడు సమాచారం వీఆర్ఓ లాగిన్ లకు పంపి 'మీరేం చేస్తారో తెలియదు వెంటనే పూర్తి చేయాల'ని అధికారులు తీవ్ర స్థాయిలో ఒత్తిడి చేస్తున్నారని, వీఆర్వోలపై ఒత్తిడి చేస్తే తమ ఉన్నత అధికారులు, రెవెన్యూ మంత్రి దృష్టికి తీసుకువెళతామన్నారు. గత ప్రభుత్వంలో జరిగిన పొరపాట్లు ఇప్పుడు కూడా చేయిస్తే ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుందని తెలియజేస్తామన్నారు.

రంగా విగ్రహాలకు అవమానం

కలిదిండి, సానారుద్రవరం గ్రామాల్లో విగ్రహాలకు పేడ పూసిన దుండగులు

అభిమానుల ధర్నా — ఎమ్మెల్యే కామినేని హామీతో నిరసన విరమణ



కలిదిండిలో రంగా విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే కామినేని, అభిమానులు



కలిదిండి, సానారుద్రవరంల్లో రంగా విగ్రహాలకు పేడ పూసిన దుండగులు

కలిదిండి, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): ఏలూరు జిల్లా కలిదిండి మండలం కలిదిండి, సానారుద్రవరం గ్రామాల్లో వంగవీటి రంగా విగ్రహాలకు అవమానం జరిగింది. గుర్తు తెలియని దుండగులు శుక్రవారం రాత్రి పేడ పూశారు. ఈ సమాచారం తెలుసుకున్న రంగా అభిమానులు శనివారం ఉదయం కలిదిండి సెంటర్‌లో రంగా విగ్రహం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదల అభ్యున్నతికి కృషి చేసిన రంగా విగ్రహానికి పేడ పూడియడం దారుణమని నినాదాలు చేశారు. దోషులను తక్షణమే కఠినంగా శిక్షించాలని ఆందోళన చేశారు. కైకలూరు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ సంఘటనా స్థలానికి విచ్చేసి దోషులను గుర్తించి త్వరలోనే చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో అభిమానులు నిరసన విరమిం చారు. ఈ ఘటన రెండు వర్గాల మధ్య ఆధిపత్య పోరులో భాగంగా కొంతమంది వ్యక్తులు ఈ దుశ్చర్యకు పాల్పడినట్లు పోలీసులు భావి స్తున్నారు. త్వరలోనే దోషులను గుర్తించి కఠినంగా శిక్షిస్తామని తెలిపారు.

రంగా విగ్రహానికి ఎమ్మెల్యే కామినేని క్షీరాభిషేకం

కలిదిండి సెంటర్‌లో ఉన్న రంగా విగ్రహానికి ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ శనివారం క్షీరాభిషేకం చేశారు. రంగా విగ్రహానికి పేడ పూయడాన్ని ఖండించారు. రంగా విగ్రహంపై పేడ పూసిన దోషులను తొందరగానే పట్టుకుని కఠినంగా శిక్షించాలని పోలీసులను ఆదేశించారు. కూటమి నాయకులు పాల్గొన్నారు.

దోషులను శిక్షించాలి : దూలం

సానారుద్రవరంలో రంగా విగ్రహానికి పేడ పూసిన దోషులను నెలాఖరుకల్లా శిక్షించకపోతే నియోజకవర్గ స్థాయిలో కలిదిండిలో రంగా విగ్రహం వద్ద నిరాహార దీక్ష చేపడతానని వైసీపీ జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు హెచ్చరించారు. శనివారం కలిదిండిలో రంగా విగ్రహానికి క్షీరాభిషేకం చేసి నాయకులతో కలిసి నిరసన తెలిపారు.

దుండగులను కఠినంగా శిక్షిస్తాం : సీఎం చంద్రబాబు

కైకలూరు : వంగవీటి మోహనరంగా విగ్రహం గుర్తుతెలియని దుండగులు దుశ్చర్యకు పాల్పడిన ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తీవ్రస్థాయిలో ఖండించారు. శనివారం ఏలూరు జిల్లా కైకలూరు నియోజకవర్గం కలిదిండిలో వంగవీటి మోహనరంగా విగ్రహం పట్ల అనుచితంగా ప్రవర్తించిన సంఘటన ముఖ్యమంత్రి దృష్టికి వెళ్లగా తీవ్రస్థాయిలో స్పందించారు. అమరావతిలో సీఎం మాట్లాడుతూ నేతల విగ్రహాల పట్ల అవమానకర చర్యలకు పాల్పడిన వారికి గట్టి గుణపాఠం చెప్పేలా పోలీసులు చర్యలు తీసుకోవాలన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా నిందితులను పట్టుకుని కఠినంగా శిక్షించాలని ఆదేశించారు. అభిమానుల మనోభావాలు దెబ్బతినేలా శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడేవారిని ఉపేక్షించే ప్రసక్తి లేదన్నారు.

దోషులను త్వరలో పట్టుకుంటాం : డీఎస్పీ



విలేకరులతో మాట్లాడుతున్న డీఎస్పీ శ్రావణ్ కుమార్

ఆ రెండు గ్రామాల్లో రంగా విగ్రహాలకు పేడ పూసిన దోషులను త్వరలోనే పట్టుకుంటామని డీఎస్పీ శ్రావణ్ కుమార్ తెలిపారు. శనివారం రాత్రి కలిదిండి పోలీస్ స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దోషులను పట్టుకోవటానికి ఆరు పోలీసు బృందాలను ఏర్పాటు చేశామన్నారు. డాగ్ స్క్వాడ్, క్లూస్ టీమ్‌లు సంఘటనా స్థలాన్ని పరిశీలించాయన్నారు. రెండు వర్గాల మధ్య ఆధిపత్య పోరులో భాగంగా కొంతమంది వ్యక్తులు ఈ దుశ్చర్యకు పాల్పడినట్లు భావిస్తున్నామన్నారు. నిందితుల ఆచూకీ ఎవరికైనా తెలిస్తే పోలీసులకు సమాచారం అందించిన వారికి బహుమతి అందిస్తామన్నారు. సీఐ రవికుమార్, ఎస్ఐ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

నేడే పోటాపోటీగా రంగా విగ్రహాల ఆవిష్కరణ

ఈడేపల్లి గ్రామంలో పోలీసు బందోబస్తు



రంగా విగ్రహాల వద్ద పోలీస్ బందోబస్తు

ముదినేపల్లి, : ఈడేపల్లి గ్రామంలో ఆదివారం జరుగనున్న దివంగత నేత వంగవీటి మోహనరంగా విగ్రహాల ఆవిష్కరణ సందర్భంగా పెద్దఎత్తున పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆ గ్రామంలో ఒకేచోట పక్కపక్కనే ఒకే సామాజిక వర్గానికి చెందిన ఇరువర్గాలు రెండు రంగా విగ్రహాలను ఏర్పాటు చేయడం, రెండు విగ్రహాలు ఒకేసారి ఆవిష్కరణ చేయనుండడతో వివాదాలు, ఉద్రిక్తతలు చోటు చేసుకునే అవకాశం ఉందనే ఉద్దేశంతో పటిష్ఠమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. విగ్రహా విష్కరణలు జరిగే ప్రదేశాల వద్ద రోడ్డు వెంబడి సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. శనివారం స్పెషల్ బ్రాంచ్, ఇంటెలిజెన్స్ వర్గాలు గ్రామంలో పరిస్థితులను పరిశీలించారు. రెండు విగ్రహాలు పక్కపక్కనే ఉన్నందున ఆవిష్కరణల సమయంలో అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నామని కైకలూరు రూరల్ సీఐ రవికుమార్ తెలిపారు. శనివారం నుంచే గ్రామంలో పోలీస్ పహారా ఏర్పాటు చేసినట్టు తెలిపారు. విగ్రహాల ఆవిష్కరణకు తొలుత ముదినేపల్లి నుంచి ఈడేపల్లి వరకు రంగా అభిమానులు, నాయకులు సుమారు 11 కిలోమీటర్ల దూరం భారీ ర్యాలీ నిర్వహించనున్నందున దారి పొడవునా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. రంగా తనయుడు వంగవీటి రాధాకు స్వాగతం పలికేందుకు ఇరువర్గాలు పోటీపడే అవకాశాలున్నట్టు ఇంటెలిజెన్సీవర్గాలు ఉన్నతాధికారులకు నివేదిక పంపారు.



టిఫిన్ చేస్తున్న మంత్రి డాక్టర్ నిమ్మల

వావ్.. మంత్రి నిమ్మల

సాధారణ వ్యక్తిలా

చిన్న హోటల్‌లో టిఫిన్ చేసిన మంత్రి

పాలకొల్లు అర్బన్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మంత్రిగా కొనసాగుతున్న డాక్టర్ మంత్రి నిమ్మల రామానాయుడు సాధారణ వ్యక్తిలా చిన్నహోటల్లో టిఫిన్ చేసి ప్రజలను ఆశ్చర్యానికి గురిచేశారు. శనివారం ఉదయం ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి కార్యక్ర మాల్లో పాల్గొనేందుకు పాలకొల్లు గాంధీ బొమ్మల సెంటర్‌కు వచ్చిన ఆయన ప్రకాశం పంతులు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎదురుగా ఉన్న చిన్న హోటల్లో అల్పాహారం తీసుకున్నారు. టీడీపీ నాయకులు గండేటి వెంకటేశ్వరరావు, కడలి గోపాలరావు, పీతల శ్రీను, గొట్టుముక్కల సూర్యనారాయణరాజు తదితరులు ఉన్నారు.



ఆకివీడు ఎంపీడీవో ఆఫీసులో

తాచుపాము హల్‌చల్

ఆకివీడు,ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): ఆకివీడులో ఎంపీడీవో కార్యాలయంలో తాచుపాము శనివారం హల్‌చల్ చేసింది. శనివారం ఉద్యోగులు మాట్లాడుతూ కార్యాలయంలోకి గోధుమ తాచుపాము రావడంతో భయాందోళన చెందా మన్నారు. అమ్మావాస్య కావడంతో పాముకు సరిగా కళ్లు కనిపించకనో కారణం స్పష్టంగా తెలియనప్పటికి జూనియర్ అసిస్టెంట్ హేమారాణి తదితరులు కర్రతో కొట్టిచంపారన్నారు. రూముల్లో కన్నాలు, తలు పుల వద్ద గుడ్డలు, సంచులు ఏర్పాటు చేసి జాగ్రత్తలు తీసుకున్నామన్నారు. ఒక్కోసారి పని ఒత్తిడిలో చీకటి పడిన తరువాళ్ల ఇళ్లకు వెళ్లేసమయంలో ప్రమాదం జరిగితే పరిస్థితి ఏమిటని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంపీడీవో మార్కండేశ్వరరావు, జూనియర్ అసిస్టెంట్ హేమారాణి, సిబ్బంది ఉన్నారు.

గేదెలను కడిగేందుకు చెరువులో దిగి ఒకరి మృతి

పెదవేగి,ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): గేదెలను కడిగేందుకు చెరువులోకి దిగిన వ్యక్తి ప్రమాదవశాత్తు మునిగి మృతి చెందాడు. పెదవేగి మండలం కొప్పాక గ్రామంలో శనివారం సజ్జా సాయిబాబా(52)అనే వ్యక్తి కూలి పనులతో పాటు పశువులను మేపుతూ కుటుం బాన్ని పోషించుకుంటున్నాడు. శుక్రవారం గేదెలను మేపేందుకు వెళ్లిన వ్యక్తి శుక్రవారం రాత్రి ఇంటికి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు, భార్య ఎంత వెతికిన సాయిబాబా ఆచుకీ లభించలేదు. చివరికి శనివారం కొప్పాక చెరువులో మృతదేహం లభ్యమైంది. గేదెలను కడిగే సమయంలో చెరువులో పడి మునిగి మృతిచెంది ఉంటాడని పోలీసులు ప్రాథమిక అంచనాకు వచ్చారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు పెదవేగి పోలీసులు తెలిపారు.

హత్యాయత్నం కేసులో అత్త అరెస్టు

ఆకివీడు, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): ఆకివీడు కాకరపర్తి చెంచయ్య వీధిలోని అపార్ట్‌మెంట్‌లో మొదటి అంతస్థులో నివాసం ఉంటున్న వెంపటి సుబ్బలక్ష్మిని పోలీసులు శనివారం అరెస్టు చేశారు. శుక్రవారం అత్త సుబ్బలక్ష్మి కోడలు హేమ సింధూజను హత్య చేయాలనే దురుద్దేశంతో మొదటి అంతస్థు నుంచి కిందకు తోసేచిన సంగతి తెలిసిందే.. సింధూజ విజయవాడ ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. తన భర్త ఫణి చంద్రశేఖర్, అత్త సుబ్బలక్ష్మి రోజూ చిత్రహింసలకు గురిచేసి చంపడానికి ప్రయత్నించారని సింధూజ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏఎస్ఐ బండి సత్యనారాయణ కేసు నమోదు చేశారు. కాళ్ల ఇన్‌చార్జి ఎస్ఐ నాలం శ్రీనివాస్ శనివారం సుబ్బలక్ష్మిని అరెస్టు చేసి భీమవరం కోర్టుకు తరలించగా రిమాండ్ విధించారు.

మానసిక సమస్యలతో ఒకరి ఆత్మహత్య

పెంటపాడు, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): గడ్డి మందు తాగిన వ్యక్తి చికిత్స పొందుతూ ఆసుపత్రిలో శనివారం మృతి చెందాడు. పెంటపాడు మండలంలోని రాచర్ల గ్రామానికి చెందిన దిద్దే పెదవెంకట్రావు(52) మానసిక సమస్యతో ఇబ్బంది పడుతున్నాడు. ఈ మేరకు శుక్రవారం ఉదయం ఇంట్లో ఉన్న గడ్డి మందు తాగాడు.అపస్మారక స్థితిలో ఉన్న వెంకట్రావును తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. కుమారుడు శ్రీను ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ స్వామి తెలిపారు.

ప్రమాదానికి కారణమైన వ్యక్తిపై కేసు

టి.నర్సాపురం, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): అతివేగంగా మోటార్ సైకిల్‌పై వచ్చి భార్య, భర్తలను ఢీకొట్టి గాయపరిచిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్టు ఎస్.ఐ. జయబాబు తెలిపారు. చింతలపూడి మండలం సీతానగరం గ్రామానికి చెందిన వేముల హరి ప్రసాద్ ఈ నెల 20న శ్రీరామవరం అత్తగారింటికి గ్రీన్‌ఫీల్డ్ హైవేపై మోటార్ సైకిల్‌పై భార్యతో కలిసి వెళ్తున్నాడు. అదే సమయంలో చింతలపూడి మండలం రాఘవాపురం గ్రామానికి చెందిన అవుదొడ్డి వెంకన్న మోటార్ సైకిల్‌పై వేగంగా వచ్చి ఢీకొట్టాడు. దీంతో భార్య, భర్తలు కిందపడటంతో తీవ్రంగా గాయపడ్డారు.వీరిని జంగారెడ్డిగూడెం ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించగా అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం విజయవాడ తరలించారు. ఆసుపత్రి నుంచి అందిన సమాచారం మేరకు శనివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్.ఐ. తెలిపారు.

గాయపడిన విద్యార్థి చికిత్స పొందుతూ మృతి

భీమవరం క్రైం, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనంపై వెళ్తున్న విద్యార్థిని వెనుక నుంచి కారు ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. భీమవరం మండలం తాడేరు గ్రామానికి చెందిన చుండూరి లీల వెంకట శివరాం(19) పట్టణంలోని ప్రముఖ ఇంజనీరింగ్ కాలేజీలో బీటెక్ సెకండియర్ చదువుతున్నాడు. ఈ నెల 11న ఉదయం ద్విచక్ర వాహనంపై కళాశాలకు వెళ్తుండగా వెనుక నుంచి వచ్చిన కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో శివరాం తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం విజయవాడ తరలించారు. పరిస్థితి విషమించడంతో అదే ఆస్పత్రిలో మృతి చెందాడు. విద్యార్థి తండ్రి శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్.ఐ. కృష్ణాజీ తెలిపారు.

లోడు లారీ వెళ్తుండగా కూలిన వంతెన

భారీ లారీల రాకపోకలే కారణం



జగన్నాథపురం కాలువ మొగ వద్ద జీఎస్‌వై కెనాల్‌పై లారీతో సహా కూలిన వంతెన

మొగల్తూరు, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): జగన్నాథపురం పంచాయతీ పరిధి కాలువ మొగ ప్రాంతంలో జీఎస్‌వీ కెనాల్‌పై ఉన్న వంతెన శనివారం రాత్రి భారీ లోడు లారీ వెళ్తుండగా ఒక్కసారిగా కూలింది.సుమారు మూడున్నర దశాబ్దాల క్రితం నిర్మించిన ఈ వంతెన గత కొంత కాలంగా శిథిలావస్థకు చేరింది. ఈ వంతెనకి ఇరుపక్కలా ఉన్న రెయిలింగ్‌లు దశాబ్దాకాలం క్రితమే కూలిపోగా కొన్ని సందర్భాల్లో తాత్కాలిక మరమ్మతులు చేశారు. ఇటీవల గ్రామంలో పెరిగిన ఆక్వా సాగు నేపథ్యంలో భారీ లోడు లారీలు ఈ వంతెనపై నుంచి రాకపోకలు సాగిస్తున్నాయి. జగన్నాథపురం పంచాయతీ పరిధిలోని ఉన్నత పాఠశాల, మచ్చగడ, భీమవరం మండలం నాగిడిపాలెంతో పాటు భీమవరం చేరుకునేందుకు కొన్ని గ్రామాల ప్రజలకు ఈ వంతెన అవసరం ఎంతో ఉంది. దీంతో శనివారం రాత్రి టిప్పర్లు లారీ లోడుతో ఈ వంతెన మధ్యలోకి వచ్చేసరికి వంతెన కూలిపోవడంతో లారీ కాలువలో పడిపోయింది. ఆ సమయంలో వాహనాల రాకపోకలు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ విషయంపై ఆర్‌అండ్‌బీ డీఈ కిరణ్ కుమార్‌ను వివరణ కోరగా ఈ వంతెన స్థానంలో నూతన వంతెన నిర్మాణానికి రూ. కోటి 65 లక్షలతో ప్రతిపాదనలు పంపడం జరిగిందన్నారు. ప్రభుత్వం నుంచి అనుమతి రాకపోవడంతో కూలిన ఈవంతెన మరమ్మతులకు రూ.20 లక్షలతో ప్రతిపాదనలు పంపామన్నారు. నిధులు మంజూరైన వెంటనే పనులు ప్రారంభిస్తామన్నారు. లారీ డ్రైవర్ తప్పించుకోవడంతో ఎవ్వరికీ ఏమీ కాలేదు.

కానిస్టేబుల్ అభ్యర్థుల సర్టిఫికెట్లు పరిశీలన



సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు హాజరైన విద్యార్థులు

ఏలూరు క్రైం, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): పోలీస్ కానిస్టేబుల్‌గా ఎంపికైన పాత పశ్చిమ గోదావరి జిల్లా అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన శనివారం జరిగింది. ఏలూరు సురేష్ చంద్ర బహుగుణ ఇంగ్లీషు మీడియం స్కూల్లో ఏలూరు జిల్లా ఎస్పీ కేపీఎస్ కిషోర్ ఆదేశాల మేరకు అదనపు ఎస్పీ ఎన్.సూర్యచంద్రరావు, డీపీవో కార్యాలయ సిబ్బందితో నిర్వహించారు. సర్టిఫికెట్ల పరిశీలనకు అభ్యర్థులు ఈ నెల 23,24వ తేదీల్లో ఉదయం 8.30 గంటలకు హాజరు కావాలని సాయంత్రం 5గంటల వరకు వెరిఫికేషన్ ఉంటుందన్నారు. ఆదివారం వచ్చే అభ్యర్థులు అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లు తీసుకురావాలని, ప్రతి సర్టిఫికెట్‌కు మూడు జిరాక్స్ కాపీలు ఉండాలని, వాటిపై గెజిటెడ్ అధికారితో అటెస్టేషన్ చేయించాలన్నారు. పాస్‌పోర్టు ఫొటోలు మూడు తీసుకురావాలన్నారు. ధ్రువీకరణ ఫారాలు పూర్తి చేయించనున్నట్టు తెలిపారు.



బాధిత కుటుంబాలతో మాట్లాడుతున్న ఎస్పీ కొమ్మి ప్రతాప శివకిశోర్

రోడ్డు ప్రమాద బాధితులకు బీమా సొమ్ము అందజేత

ఏలూరు క్రైం, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాల్లో హిట్అండ్‌రన్ కేసుల్లో మరణించిన కుటుంబాలకు రెండు లక్షల రూపాయలు, క్షతగాత్రులకు రూ.50 వేలు లబ్ధిదారుల అకౌంట్‌లో జమ చేసినట్టు జిల్లా ఎస్పీ కేపీఎస్ కిషోర్ తెలిపారు. రోడ్డు ప్రమాదాల్లో హిట్అండ్‌రన్ కేసుల్లో సుప్రీంకోర్టు ఉత్తర్వులు జారీ చేసిందని ఈ ఉత్తర్వుల మేరకు కేంద్ర రోడ్డు రవాణా మంత్రిత్వ శాఖ బీమాను మృతులకు రెండు లక్షల రూపాయలు, క్షతగాత్రులకు రూ.50 వేలు అందజేస్తాం దన్నారు. దీనిలో భాగంగా జిల్లాలో భీమడోలు పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక కేసు, దెందులూరు పోలీస్ స్టేషన్ పరిధిలో రెండు కేసులు, ఏలూరు త్రి టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో మూడు కేసులు, జంగారెడ్డిగూడెం పోలీస్ స్టేషన్ పరిధిలో మూడు కేసులు, కలిదిండి కొయ్యలగూడెం, నూజివీడు, పెదవేగి పోలీస్ స్టేషన్ల పరిధిలో ఒక్కో కేసుకు సంబంధించి క్షతగాత్రులకు నష్టపరిహారాన్ని జమ చేశారన్నారు.సొమ్ములు అందించేలా కృషి చేసిన ఎస్పీకి కృతజ్ఞతలు తెలిపారు.

నేరస్థులకు శిక్షలు పడేలా విధులు నిర్వర్తించాలి

ఏలూరు క్రైం, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): నేరస్థులకు శిక్షలు పడేలా సమర్థవంతంగా కోర్టు మానిటరింగ్ సెల్ సభ్యులు విధులు నిర్వర్తించాలని అదనపు ఎస్పీ ఎన్.సూర్యచంద్రరావు అన్నారు. ఎస్పీ కొమ్మి ప్రతాప శివ కిషోర్ ఆదేశాలతో ఏలూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో శనివారం జిల్లాలోని కోర్టు మోనటరింగ్ సెల్ సభ్యులతో సమీక్ష సమావేశాన్ని అదనపు ఎస్పీ ఎన్ సూర్యచంద్రరావు నిర్వహించారు. అదనపు ఎస్పీ ఎన్ సూర్యచంద్రరావు మాట్లాడుతూ కేసుల విచారణ వేగంగా జరగాలంటే సాక్ష్యులను సకాలంలో కోర్టుకు హాజరు పర్చాలన్నారు. ప్రతి రోజు కోర్టులో జరిగిన ప్రక్రియను డాక్యుమెంట్ రూపంలో అధికారికి నివేదిక అందించాలన్నారు. ఏమైనా ఇబ్బందులు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని ఆయన సూచించారు. ఈ సదస్సులో డీసీఆర్బీ ఇన్‌స్పెక్టర్ అబీబ్‌బాషా, కోర్టు మోనటరింగ్ సెల్ అధికారులు పాల్గొన్నారు.

న్యాయం చేయండి..

ఏలూరు రూరల్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): తన పొలం చుట్టూ సిమెంట్ దిమ్మలతో ఫెన్సింగ్ వేస్తే ఇటీవల కొన్ని దిమ్మెలు అపహరణకు గురయ్యాయని దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని, దెందులూరు మండలం శ్రీరాంపురం గ్రామానికి చెందిన కామిరెడ్డి వీర వెంకట సత్య సతీశ్ శనివారం కలెక్టర్, పోలీస్ ఉన్నతాధికారులు కలిసి ఫిర్యాదు చేశారు. కొందరు తనను బెదిరించి కులం పేరుతో దూషించారని ఆవేదన వ్యక్తం చేశారు. న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

వివాహిత ఆత్మహత్య

ముదినేపల్లి,ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): మద్యానికి బానిసైన భర్త వేధింపులు భరించలేక పుట్టింటికి చేరిన ఓ వివాహిత మనస్తాపానికి గురై పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంది.కలిదిండి మండలం కోరుకొల్లుకు చెందిన కామాక్షికి చల్లపల్లి మండలం మంగళాపురం గ్రామానికి చెందిన పేరం శ్రీనుకు 12 ఏళ్ల క్రితం వివాహమైంది. మద్యానికి బానిసైన శ్రీను వేధింపులు తట్టుకోలేక కామాక్షి ఇటీవల కోరుకొల్లు వచ్చేసింది. ఇటీవల భర్త శ్రీను కోరుకొల్లు వచ్చి హాస్టల్‌లో ఉంటున్న ఇద్దరి పిల్లల్ని మంగళాపురం తీసుకెళ్లాడు. దీంతో మనోవేదనకు గురైన కామాక్షి జీవితంపై విరక్తిచెంది ఈ నెల 8న పురుగుల మందు తాగి చెల్లికి ఫోన్ చేసి చెప్పింది. వెంటనే కుటుంబ సభ్యులు ఆమెను గుర్తించి గుడివాడ ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్ళి మెరుగైన చికిత్స కోసం విజయవాడ తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం కామాక్షి మృతి చెందింది. తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ప్రజా పాలన అందిస్తున్న ప్రభుత్వం : ఎమ్మెల్యే చింతమనేని

దెందులూరు, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రజా పాలన అందిస్తోందని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. శనివారం నియోజకవర్గంలోని భోగాపురం, అమ్మ పాలెం, పెదకడిమి గ్రామాల్లో సుపరిపాలనపై తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే పర్యటించారు. అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలతో పాటు పలువురిని పార్టీలోకి ఆహ్వానించారు. కడియాల శ్రీరామ్ చౌదరి, డోప్పలపూడి సుమంత్, ఈడ్పుగంటి అనిల్ కుమార్, కోసరాజు ప్రసాద్, పెదకడిమి సర్పంచ్ కోసరాజు బలరాం, మదాల రాము పాల్గొన్నారు.

వైద్య భగవానుడికి అభిషేకాలు, అర్చనలు



ఏలూరుకార్పొరేషన్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): స్థానిక పవరుపేట స్టేషన్ రోడ్డులోని శ్రీ ధన్వంతరి వైద్య భగవానుని ఆలయం వద్ద భక్తులు సామూహికంగా అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. ఆలయ ప్రదక్షిణలు నిర్వహించి ఆలయ అర్చకులు రాళ్ళబండి ఆదినారాయణ శర్మ ద్వారా రక్షాబంధనాలు కట్టించుకుని సూర్య నమస్కార పూజలు జరిపారు. భజనలు నిర్వహించి సూర్యనామ స్తోత్రాలను పఠించారు. ఆలయ చైర్మన్ కోరాడ రెడ్డి, బూరాడ పూర్ణచంద్రరావు పాల్గొన్నారు.

టంగుటూరికి పలువురి నివాళి



నివాళులర్పిస్తున్న ఎస్పీ కిశోర్

ఏలూరు అర్బన్/క్రైం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రరాష్ట్ర తొలి ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతిని శనివారం నగరంలోని పలు విద్యా సంస్థల్లో నిర్వహించారు. సెయింట్ థెరిస్సా మహిళా కళాశాలలో ప్రిన్సిపాల్ సిస్టర్ మెర్సీ మాట్లాడుతూ టంగుటూరి చేసిన పోరాటాలగురించి వివరించారు. ఆంధ్ర రాష్ట్రానికి ఆయన అవిశ్రాంత సేవలందించారని పేర్కొన్నారు. ఆర్ఆర్ పేట శ్రీశ ర్వాణి విద్యా సంస్థల్లో నిర్వహించిన కార్యక్రమంలో కొత్తపేటలో నెలకొల్పిన టంగు టూరి నిలువెత్తు విగ్రహానికి స్కూలు హెచ్ఎం సత్యశారద, డైరెక్టర్ మదనమోహన రాజు పూల మాలలువేసి నివాళులర్పించారు. ఏలూరు జిల్లా పోలీస్ కార్యాల యంలో టంగుటూరి ప్రకాశం పంతులు చిత్రపటానికి ఎస్పీ కొమ్మి ప్రతాప శివ కిశోర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎస్పీ మాట్లాడుతూ దేశ భక్తి, ధైర్య సాహసాలకు టంగుటూరు ప్రతీకగా నిలిచారన్నారు. అదనపు ఎస్పీ ఎన్ సూర్యచంద్ర రావు, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ సిహెచ్ మల్లేశ్వరరావు, ఆర్ఐ పవన్‌కుమార్, జిల్లా న్యాయసలహాదారుడు గోపాలకృష్ణ పలువురు పాల్గొన్నారు.

షెడ్యూల్ కులాల యువతకు డ్రైవింగ్‌లో శిక్షణ

ఏలూరుటూటౌన్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): షెడ్యూల్ కులాలకు చెందిన యువతకు హెవీ మోటార్ వెహికల్ డ్రైవింగ్‌లో శిక్షణనిస్తామని ఎస్సీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎం.ముక్కంటి తెలిపారు. శిక్షణ నిమిత్తం ఒక్కోఅభ్యర్థికి రూ.20 వేలు ఖర్చు చేస్తామన్నారు. జిల్లాలో ఐదుగురు పురుషులు, ఐదుగురు మహిళలను ఎంపిక చేస్తామన్నారు. కలెక్టర్ ఆధ్వర్యంలో కమిటీ అభ్యర్థులను ఎంపిక చేస్తుందన్నారు. దరఖాస్తుదారులు లైట్‌మోటార్ వెహికల్ లైసెన్సు తీసుకుని ఏడాది అయ్యుండాలన్నారు. అనంతరం హెవీడ్రైవింగ్ లెర్నర్ లైసెన్స్ కూడా కలిగి ఉండాలన్నారు. కనీస వయస్సు 20 -40మధ్య ఉండాలన్నారు. మెడికల్ ఫిట్‌నెస్ సర్టిఫికెట్ అవసరమవుతుందన్నారు. శిక్షణాకాలం 40 రోజుల పాటు ఉంటుందన్నారు. ఈ నెల 27వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు.ఎంపికైన అభ్యర్థులకు సెప్టెంబర్ 5 నుంచి శిక్షణ ప్రారంభమవుతుందన్నారు. వివరాలకు 80196 84966 ఫోన్ నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

నిరుపేద విద్యార్థినులకు స్నేహితుల క్లబ్ చేయూత

ఏలూరు అర్బన్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): నిరుపేద కుటుంబానికి చెందిన బాలిక కాలికి శస్త్రచికిత్స నిమిత్తం ఏలూరుకు చెందిన శ్రీసాయి హెల్పింగ్ హ్యాండ్స్ క్లబ్ ప్రతినిధులు శనివారం రూ.10వేలు ఆర్థికసాయాన్ని అందజేశారు. శనివారపుపేట జడ్పీ హైస్కూల్లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థిని కె.కావ్య శస్త్రచికిత్స కోసం ఉద్యోగులు, స్నేహితులు స్వచ్ఛందంగా ఆర్థిక సాయం చేయడం పట్ల స్కూల్ హెచ్ఎం ప్రకాష్ అభినందించారు. అలాగే సీఆర్‌రెడ్డి మహిళా కళాశాలలో బీకాం ప్రథమ సంవత్సరం చదువుతున్న ఈర్ల కోమలరాణి చదువు నిమిత్తం రూ.10 వేలు ఆర్థిక సాయాన్ని కళాశాల ప్రిన్సిపాల్ సరళద్వారా అందజేశారు. సంస్థ ప్రతినిధులు జి.కృష్ణ, మోహన్‌రావు, ప్రకాష్, రాంబాబు, శ్రీనివాసరావు, మానవత సంస్థ ప్రతినిధి అజయ్‌బాబు, శనివారపుపేట హైస్కూలు హెచ్ఎం ప్రకాశ్ పాల్గొన్నారు.

సీఆర్ రెడ్డిలో విద్యావేత్తల సాధికారిత వర్క్‌షాప్

పెదపాడు, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): వట్లూరులోని సర్ సీఆర్‌రెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో జెనెరేటివ్ కృతిమ మేధస్సు, ప్రాంప్ట్ ఇంజనీరింగ్‌లతో విద్యావేత్తల సాధికారిత అనే అంశంపై ఒక్కరోజు వర్క్‌షాపు శనివారం జరిగింది. ముఖ్యఅతిథిగా శ్రీచక్ర ఐజినిటెడ్ లెర్న్ టెక్ ఫౌండర్ సీఈవో ఎన్.శ్రీనివాసచక్రవర్తి పాల్గొని వర్క్‌షాప్‌నుద్దేశించి మాట్లాడారు.విద్యార్థుల బోధన, అధ్యాయనంలో జెనెరేటివ్ కృతిమ మేధస్సు ఉప కరణాల పాత్ర ఎంతో కీలకమైందని, ఇంజనీరింగ్ విద్యార్థులకు సునిశిత, సూక్ష్మస్థాయి పరిశీలన ఎంతగానో అవసరమని చక్రవర్తి తెలిపారు. కళాశాల కరస్పాండెంట్ జాస్తి మల్లికార్జునుడు, కొండా హరిరామకృష్ణంరాజు, ప్రిన్సిపాల్ డాక్టరు కె.వెంకటేశ్వరరావు, వర్క్‌షాపు కో-ఆర్డినేటర్ డాక్టరు బి.మాధవరావు, వివిధ విభాగాల హెచ్‌వోడీలు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఏలూరు నగరంలో శక్తి టీమ్ బృందాల నిఘా

ఏలూరు క్రైం, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): ఏలూరు మహిళా పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఎం.సుబ్బారావు ఆధ్వర్యంలో శక్తి టీమ్ పోలీసులు నగరంలోని కళాశాలలు, పాఠశాలలు వద్ద శనివారం సాయంత్రం గస్తీ నిర్వహించారు. ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా పెట్రోలింగ్ నిర్వహించారు.ఆకతాయిలను గుర్తించేందుకు కొన్ని బృందాలు నిఘా ఏర్పాటు చేసి పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థినులతో మాట్లాడుతూ శక్తియాప్‌పై అవగాహన కల్పించారు. ఆండ్రాయిడ్ మొబైల్‌లో శక్తియాప్ ఉంటే పోలీసులు తమతో ఉన్నట్లేనని ఆ యాప్‌లో ఎస్‌వోఎస్ బటన్ నొక్కగానే పోలీసు గస్తీ బృందం వారి వద్దకు చేరుకుంటుందన్నారు. అత్యవసర పరిస్థితుల్లో 112కు కాల్ చేయాలని, మహిళా హెల్ప్ లైన్ 181కు కూడా కాల్ చేయవచ్చునని సూచించారు.

పోలీసు అధికారులకు ఎన్‌డీపీఎస్ చట్టాలపై అవగాహన

ఏలూరు క్రైం, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఉన్న పోలీసు అధికారులకు ఎన్‌డీపీఎస్ చట్టాలు, వాటి అమలు విధానంపై అవగాహన కార్యక్రమాన్ని ఏలూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో శనివారం నిర్వహించారు. జిల్లా ఎస్పీ కొమ్మి ప్రతాప శివ కిషోర్ ఆదేశాల మేరకు అదనపు ఎస్పీ ఎన్.సూర్యచంద్రరావు ఆధ్వర్యంలో ఈగల్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లాలో పోలీసు అధికారులు, సిబ్బంది ఎన్‌డిపిఎస్ చట్టాలపై అవగాహన కల్గి ఉండాలని వాటి అమలులో సమగ్ర పరిజ్ఞానం పెంపొందించుకోవాలని అదనపు ఎస్పీ ఎన్ సూర్యచంద్రరావు, ఈగల్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ అన్నారు. అధికారులకు చట్టపరమైన విధానాలు, వాటి అమలుపై ఏ విధంగా చర్యలు తీసుకోవాలో ప్రాక్టికల్ డెమో క్లాసులను నిర్వహించి వివరించారు. డీసీఆర్బీ ఇన్‌స్పెక్టర్ ఆటీబ్‌బాషా, త్రి టౌన్ ఇన్‌స్పెక్టర్ కోటేశ్వరరావు, పెదవేగి ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్, జీలుగుమిల్లి ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరరావు, నూజివీడు రూరల్ ఇన్‌స్పెక్టర్ కె రామకృష్ణ, కుక్కునూరు ఇన్‌స్పెక్టర్ రమేష్‌బాబు, ఏలూరు ఈగల్ ఆర్ఎస్ఐ ఉదయ భాస్కర్ పాల్గొన్నారు.

రైతులకు సరిపడా యూరియా సరఫరా చేయాలి

ఏలూరు కార్పొరేషన్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): జిల్లాలో రైతులకు సరిపడా యూరియాను సరఫరా చేయాలని, కృత్రిమ కొరత సృష్టించేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి, కార్యవర్గ సభ్యులు కె.శ్రీనివాస్‌లు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక అన్నేభవనం వద్ద వారు మాట్లాడుతూ జిల్లాలో పలుచోట్ల రైతులకు యూరియా దొరకక ఇక్కట్లు పడుతున్నారన్నారు. యూరియా కోసం పోలవరం, గూటాలలో రైతులు ఎదురుచూసినా పట్టించుకోవడంలేదన్నారు. కలెక్టర్ చెప్పడం మాత్రం రైతులకు సరిపడా యూరియా సరఫరా చేస్తున్నారని అంటున్నారన్నారు.ఆగస్టు నెలలో 10వేల 103 టన్నుల యూరియా అవసరం కాగా సరఫరా చేసింది 5 వేల 496 టన్నులు మాత్రమేనని లెక్క చెబుతున్నాయన్నారు.

ఘనంగా మానవత ఆవిర్భావ దినోత్సవం

ఏలూరు కార్పొరేషన్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): వంగాయగూడెంలోని కేన్సర్ జనరల్ ఆసుపత్రి వద్ద మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. ఆసుపత్రిలోని వ్యాధిగ్రస్థులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రి వైద్యులు డాక్టర్ రవితేజ మాట్లాడుతూ ప్రాథమిక దశలో వ్యాధిని గుర్తించి నివారించాలని, వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలన్నారు. మానవత సంస్థ జిల్లా కేంద్ర నియంత్రణ కమిటీ చైర్మన్ ఆలపాటి నాగేశ్వరరావు, ఏలూరు యూనిట్ అధ్యక్షులు ఎం.ఎస్.కుమార్, మండల చైర్ పర్సన్ అడుసుమిల్లి నిర్మల, జిల్లా సెంట్రల్ కమిటీ కన్వీనర్ పోలవరపు దేవరత్నాకరరావు, డవలప్‌మెంట్ కమిటీ చైర్మన్ మేతర అజయ్‌బాబు పాల్గొన్నారు.

సైకిల్ సారథి.. ఎవరు?

(3వ పేజీ తరువాయి)

వివిధ నియోజకవర్గాల్లో ఇప్పటికే అనుకూలత వ్యక్తమవుతోంది. అయితే ఈ మధ్యనే ఆయనకు డీసీసీబీ, ఆప్కాబ్ చైర్మన్ వంటి పదవులు లభించడంతో తిరిగి ఆయన్నే కొనసాగిస్తారా అనేది తేలబోతుంది. సీనియర్ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ పేరును మరికొందరు ప్రస్తావిస్తున్నారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో పార్టీకి పూర్తిగా అండగా నిలబడే నేత అవసరమని ఆ సత్తా ప్రభాకర్‌కు ఉందనేది మరికొందరి వాదన. ఇంకోవైపు ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి పేరు అధ్యక్ష రేసులో ప్రస్తావనకు వస్తోంది. ఆయన అనుచరులు కూడా ఇలాంటి డిమాండ్‌కు మద్దతు ఇస్తున్నారు. చంటి మాత్రం ఇప్పటి వరకు ఈ అంశంపై నోరు విప్పలేదు. కొందరేమో మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళికి, బీసీ వర్గాల నుంచి జంగారెడ్డిగూడెంకు చెందిన శ్యామ్ చంద్రశేషుకు అవకాశం ఇవ్వాలని అంతర్గతంగా డిమాండ్ చేస్తున్నారు. అయితే ఏడు నియోజకవర్గాల పరిధిలో ఇప్పటికే అత్యధికులు అభిప్రాయా లను ఆయా నియోజకవర్గాల నేతలు రాబట్టినట్టు సమాచారం. ఇంకోవైపు సాధ్యమైనంత మేర ఒకరిద్దరి పేర్లను సూచించాల్సిందిగా పరిశీలకులకు ఆదేశాలిచ్చినట్టు చెబుతున్నారు.

ఎరువులకు కొరత లేదు..

రైతులకు సరిపడినంత మేర నిల్వలు ఉన్నాయన్న కలెక్టర్ వెట్రిసెల్వి

ఏలూరుసిటీ, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి):ఏలూరు మండలం చాటపర్రు సొసైటీలో ఎరువుల సరఫరా, గొడౌన్‌ను సంబంధిత అధికారులతో కలిసి జిల్లా కలెక్టర్ కె వెట్రిసెల్వి శనివారం ఆకస్మిక తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ జిల్లాలో సరిపడా ఎరువులు నిల్వలు ఉన్నాయని, ఎటువంటి ఎరువుల కొరత లేదని స్పష్టం చేశారు. ముఖ్యంగా యూరియా సరఫరాపై ఆకస్మిక తనిఖీలు చేయడం జరిగిందని, రైతులకు నానో యూరియా, నానో డీఏపీ గురించి రైతులకు అవగాహన కల్పించి వారితో వినియోగించాలని తెలిపారు. రైతాంగానికి ఎలాంటి ఇబ్బంది లేకుండా ఎరువుల సరఫరా చేయాల్సిందిగా అధికారులకు ఆదేశాలు జారీ చేశారన్నారు. యూరియాని అవసరం మేరకు దఫదఫాలుగా రైతులకు సరఫరా చేయడానికి తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఎవరైనా ఎరువుల కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అక్రమ రవాణాను నివారించటానికి అంతర జిల్లా, అంతర రాష్ట్ర చెక్‌పోస్టు వద్ద కఠినమైన నిఘా ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు. అక్రమంగా ఎరువులు నిల్వ ఉంచేవారిపై కేసులు నమోదు చేస్తున్నామని, అంతేగాక ఎవరైనా డీలర్లు ఎరువులను బ్లాక్ మార్కెటింగ్ చేసినా అధిక ధరలకు అమ్మినా చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. ఆర్డీవో ఎం. అచ్యుత అంబరీష్, వ్యవసాయ శాఖ జేడీ హేక్ హబీబ్ బాషా, ఫిషరీస్ డీడీ బి.నర్సయ్య, వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు ఇ.అనిల్‌కుమారి, తహసీల్దార్ జి.విజయకుమార్‌రాజు, మండల వ్యవసాయ శాఖాధికారి డి.వెంకటేశ్వర్లు, సొసైటీ ఉద్యోగులు పాల్గొన్నారు.



వివరాలడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ వెట్రిసెల్వి

350 మందికి వైద్య పరీక్షలు

దెందులూరు, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో పేదలకు సైతం నాణ్యమైన విద్య, వైద్యం అందించాలనే ఉద్దేశంతో కృషి చేస్తున్నట్టు పెదవేగి ఎస్ఎంసీ వైద్య, విద్య సంస్థ ట్రస్టు చైర్మన్ రెవ ఫాదర్ డాక్టర్ చుక్కా డొమినిక్ పేర్కొన్నారు. శనివారం ఎస్ఎంసీ సంస్థల డైరెక్టర్ చుక్కా అవినాష్ రాజు ఆధ్వర్యంలో మెగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించి 350 మందికి పరీక్షలు చేశారు. లండన్ వైద్యులు ట్రేసి, వైద్య నిపుణులు చుక్కా తాన్యరాజ్, కె.సంధ్యారాణి, హరికిషన్, గీతిక, జి.సుమంత్, కె.సందీప్, కాటమనేని శిల్ప వైద్య సేవలందించారు. అవసరమైన వారికి త్వరలో కళ్లజోళ్లను ఉచితంగా అందిస్తామని అవినాష్ రాజు తెలిపారు.

ఒంగోలు సభకు తరలిన కార్యకర్తలు

ఏలూరు కార్పొరేషన్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): భారత కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో ఈ నెల 25వ తేదీ వరకు ప్రకాశం జిల్లా ఒంగోలులో జరిగే 28వ రాష్ట్ర మహాసభలు విజయవంతం చేయాలని కోరుతూ సీపీఐ నాయకులు, కార్యకర్తలు శనివారం నగరంలోని పలు డివిజన్లలో ఎర్ర జెండాలు, బ్యానర్లతో ఎర్ర చొక్కాలు వేసుకుని భారీ ప్రదర్శనలు నిర్వహించారు. ఉత్సాహంగా ఒంగోలు సభలకు తరలివెళ్లారు. ఏలూరు జిల్లా నుంచి కొమ్ము డ్యాన్స్, రేలారే నృత్యం, డప్పు కళాకారులతో పాటు 500 మంది యువ కమ్యూనిస్టు జనసేవా కార్యకర్తలు తరలివెళ్లారు.



చౌదరిని సన్మానిస్తున్న నాయకులు

గారపాటి చౌదరికి అభినందనలు

ఏలూరు రూరల్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర బీజేపీ అధ్యక్షులు పీవీఎన్ మాధవ్ ప్రకటించిన నూతన రాష్ట్ర కమిటీలో గారపాటి సీతారాంజనేయ చౌదరిని రాష్ట్ర భారతీయ జనతా పార్టీ ఉపాధ్యక్షుడిగా నియమించడం పట్ల, ఏపీఎస్ ఆర్టీసీ విజయవాడ జోనల్ చైర్మన్ రెడ్డి అప్పలనాయుడు హర్షం ప్రకటించారు. శుక్రవారం గారపాటి చౌదరిని మర్యాద పూర్వకంగా కలిసి పుష్ప గుచ్చాలు అందజేసి అభినందనలు తెలిపారు. జనసేన నగర అధ్యక్షులు వీరంకి పండు, సదిరి రాజేష్‌రెడ్డి, గౌరీశంకర్, చిట్టిబొమ్మ రమేశ్ కలిసిన వారిలో ఉన్నారు.

ఎరువుల షాపుల్లో అధికారుల తనిఖీలు

దెందులూరు/భీమడోలు, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): దెందులూరు మండలం కొవ్వలి గ్రామంలోని ఎరువుల దుకాణాలను తహసీల్దార్ బత్తుల సుమతి, వ్యవసాయ శాఖ అధికారి ఎల్.శ్రీనివాసరాజులు పరిశీలించారు. భీమడోలోని పలు ఎరువుల షాపుల్లో తహసీల్దార్ రమాదేవి తనిఖీలు నిర్వహించారు. ఏవో ఎషారాణి, మత్స్యశాఖ సివిల్ సప్లై అధికారులు పాల్గొన్నారు.

మట్టి గణపతి ప్రతిమలనే పూజిద్దాం

ఏలూరు రూరల్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): కాలుష్య నియంత్రణ మండలి ఏలూరు శాఖ పర్యవేక్షణలో వినాయక చవితి పండుగను పర్యావరణ హితమైన పండుగగా జరుపుకోవాలని, కేవలం మట్టితో తయారు చేసిన వినాయకుని ప్రతిమలను మాత్రమే వాడాలని, పీవోపీతో చేసిన విగ్రహాలను వాడకూడదని కోరుతూ శనివారం నగరంలోని పలుచోట్ల కళాజాత నిర్వహించారు. డీజే బాక్సులతో శాబ్దకాలుష్యం అవుతుందన్నారు. ప్రజలు పర్యావరణాన్ని కాపాడుకునేలా అడుగులు వేయాలని కోరారు.



సమావేశంలో మాట్లాడుతున్న బొరగం

స్త్రీశక్తి పథకంతో మహిళలకు మేలు

కొయ్యలగూడెం, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం శ్రీశక్తి పథకం ఎంతో దోహదపడుతుందని ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాస్ అన్నారు. ఈ మేరకు శనివారం స్థానిక మండల పరిషత్ సమావేశపు హాల్లో నియోజకవర్గ అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ పథకాలు విజయవంతం కోరుతూ నియోజకవర్గ స్థాయిలో ఒక సభ ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. సభను విజయవంతం చేయాలని కోరారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో రాష్ట్ర అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. జనసేన నాయకులు కరాటం ఉమా, నియోజకవర్గ పరిశీలకులు అనపర్తి వెంకట నారాయణ, మాజీ ఏఎంసీ చైర్మన్ పారేపల్లి రామారావు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి శీలం వెంకటేశ్వరరావు, బుట్టాయగూడెం టీడీపీ మండలాధ్యక్షుడు సోంబాబు, నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ కొండేపాటి రామకృష్ణ, జనసేన మండలాధ్యక్షుడు తోట రవి, టీడీపీ నాయకులు మేఘలాదేవి, తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు సీఎం పెద్దపీట : రోషన్

చింతలపూడి, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి):సీఎం చంద్రబాబు మహిళా సాధికారతకు పెద్ద పీట వేశారని ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ అన్నారు. శనివారం చింతలపూడి మండలం పోతునూరు సొసైటీ వద్ద ఏర్పాటు చేసిన సూపర్-6లోని స్త్రీ శక్తి మహిళా పథకంలో భాగంగా ఏర్పాటు చేసిన మహిళా సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. సూపర్-6 పథకాల్లోని అన్ని హామీలు ఏడాదిలోపే నెరవేర్చారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా రెండున్నర కోట్ల మంది మహిళలకు ఉచిత బస్సు పథకంతో లబ్ధి చేకూరుతోందన్నారు. కూటమి నాయకులు మాటూరి వెంకట్రామయ్య, చీదరాల మధుబాబు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

స్త్రీనిధి సొమ్ము స్వాహా చేసిన వారిపై
చర్యలు తీసుకోవాలి

జీలుగుమిల్లి, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): డ్వాక్రా సంఘాల మహిళలు చెల్లించే స్త్రీ నిధి డబ్బులు వీవోఏ స్వాహా చేసిందని తగు చర్యలు తీసుకోవాలని డ్వాక్రా మహిళలు అధికారులను కోరారు. జీలుగుమిల్లిలో 5 డ్వాక్రా గ్రూపులకు చెందిన మహిళలు ఇటీవల స్త్రీ నిధి రుణాలు తీసుకున్నారు. నెల నెలా చెల్లించాల్సిన వాయిదా సొమ్మును గ్రామ వీవోఏగా పనిచేస్తున్న ఒ మహిళకు చెల్లిస్తున్నామన్నారు. శనివారం ఐకేపీ కార్యాలయంలో జరిగే మండల సమాఖ్య సమావేశానికి వచ్చిన స్త్రీనిధి ఏజీఎం కె.చెన్న కేశవులుకు మహిళలు సమస్యను పరిష్కరించాలని విన్నవించారు. ఈ విషయమై ఏజీఎం మాట్లాడుతూ డ్వాక్రా మహిళలు చెల్లించిన సొమ్ము విషయమై విచారణ జరుపుతామన్నారు. ఓవర్ డ్యూ రూ.4లక్షలు ఉందన్నారు. వీవోఏపై అధికారులకు పిర్యాదు చేసిన వారిలో జగదీశ్వరీ, అంబికా, చంద్రమౌళి, జగదాంబ, భువనేశ్వరి గ్రూపుల మహిళలు ఉన్నారు.

పూళ్ల పీహెచ్‌సీ పరిశీలన

భీమడోలు, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): పూళ్ల ప్రాథమిక ఆరోగ్య వైద్య కేంద్రాన్ని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి పీజే జాన్ అమృతం ఆకస్మికంగా సందర్శించారు. వైద్య కేంద్రంలో ప్రసూతి గదులను పరిశీలించారు. రోగులను పలకరించి సౌకర్యాలపై ఆరా తీశారు. ఆసుపత్రి పరిసరాలను పరిశీలించారు.



నిరసన వ్యక్తం చేస్తున్న ఆటో కార్మికులు

ఉపాధి కల్పించాలని ఆటో డ్రైవర్ల నిరసన

కామవరపుకోట, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): తమకు ఉపాధి కల్పించాలని కోరుతూ ఆటో డ్రైవర్లు శనివారం తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఆటో డ్రైవర్ల యూనియన్ నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు పథకాన్ని ప్రవేశపెట్టిన నేపథ్యంలో తమకు ఉపాధి కరువైందని, అద్దెలు కట్టుకోలేకపోతున్నామని, జీవనం కష్టతరంగా మారిందంటూ సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని కామవరపుకోట తహసీల్దార్ గెడ్డం ఎలీషాకు అందజేశారు. తొలుత ఆటో డ్రైవర్లు జెండాలు, బ్యానర్లతో నిరసిస్తూ గ్రామంలో ప్రదర్శన జరిపి అనంతరం తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని కొద్దిసేపు నిరసన వ్యక్తం చేసి అనంతరం వినతిపత్రం అందజేశారు.



బుచ్చి రాంప్రసాద్‌ను సన్మానిస్తున్న సంఘ నాయకులు

బ్రాహ్మణ సంఘాల హర్షం

ఏలూరు రూరల్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): బ్రాహ్మణ కార్పొరేషన్‌ను పునరుద్ధరించి బుచ్చి రాంప్రసాద్‌ను కార్పొరేషన్ చైర్మన్‌గా నియమించడం పట్ల రాష్ట్ర బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య ప్రతినిధులు హర్షం ప్రకటించారు. ఈ మేరకు శనివారం సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొనూరు సతీష్ శర్మ, అడ్వైజరీ కమిటీ చైర్మన్ సత్యవాడ దుర్గాప్రసాద్, కోశాధికారి పులిపాక ప్రసాద్, తదితరులు బుచ్చి రాంప్రసాద్‌ను మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు. కార్పొరేషన్ చైర్మన్ నియామకం చేసినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్పొరేషన్ ద్వారా బ్రాహ్మణులకు మేలు జరిగే లాగా చర్యలు తీసుకోవాలని వారు కోరారు. బ్రాహ్మణ సామాజికవర్గ అభ్యున్నతి కోసం రాంప్రసాద్ ఎన్నో ఏళ్లుగా పాటుపడుతున్నారు. ఆయన సేవలను గుర్తింపుగా నామినేటెడ్ పోస్టు దక్కిందని బుచ్చి రాంప్రసాద్‌కు ఈ పదవి ఇవ్వడం సముచితమన్నారు.

ముంపు ప్రమాదం తలెత్తకుండా చర్యలు

ఏలూరు రూరల్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాంతాల నుంచి వరద నీరు కొల్లేరులో చేరుతున్న దృష్ట్యా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్లు కైకలూరు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్, దెందులూరు చింతమనేని ప్రభాకర్ స్పష్టం చేశారు. "కొల్లేరులోకి భారీగా చేరుకుంటున్న వరద నీరు నిలిచిపోయి, లంక గ్రామాలకు ముంపు ప్రమాదం తలెత్తకుండా ఉండేలా చర్యల నిమిత్తం గుడివాకలంక గ్రామం వద్ద పరిశీలించారు.కొల్లేరు పరివాహక ప్రాంత ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పూర్తి స్థాయిలో చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

11 నెలల జీతాల బకాయిలు చెల్లించాలి

పోలవరం, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): సత్యసాయి మంచి నీటి కార్మికులు తమకు కాంట్రాక్టరు చెల్లించాల్సిన 11 నెలల జీతాల బకాయిలు వెంటనే చెల్లించాలని లేనిపక్షంలో మంచి నీటి సరఫరా చేసేదిలేదని ప్రారంభించిన సమ్మె శనివారం రెండో రోజు కొనసాగింది. కన్నాపురం అడ్డరోడ్డు వద్ద కార్మికులు చేపట్టిన సమ్మెకు సీఐటీయూ ప్రజా సంఘాలు సంఘీభావం తెలిపాయి. ఈ సందర్భంగా కార్మికులకు ఇవ్వవలసిన జీతాల బకాయిలు వెంటనే చెల్లించాలని సీఐటీయూ ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

ఉంగుటూరు, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): నిరుపేదలకు సీఎం సహాయ నిధి ఎంతగానో ఉపయోగపడుతోందని ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అన్నారు. శనివారం స్థానిక క్యాంపు కార్యాలయంలో సి.ఎం. రిలీఫ్ చెక్కులను తొమ్మిది మంది లబ్ధిదారులకు పంపిణీ చేశారు. నూతన ప్రభుత్వం వచ్చిన నాటి నుంచి నేటి వరకు రూ.2 కోట్లకు పైగా పంపిణీ చేసినట్టు ఎమ్మెల్యే కార్యాలయ ప్రతినిధి తెలిపారు.

నిర్వాసితులను పట్టించుకోండి

కుక్కునూరు, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి):నిర్వాసితులను వారి సమస్యలను ఏ మాత్రం పట్టించుకోకుండా గాలికి వదిలేస్తున్నారని సీపీఐ (ఎంఎల్)ప్రజాపందా జిల్లా కమిటీ కార్యదర్శిగా ఎస్.కె.గౌస్ ఆరోపించారు. శనివారం ఉప్పరమద్దిగట్ల గ్రామంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు వలన నిర్వాసితులు అన్ని విధాలా నష్టపోతున్నారన్నారు. ఏటా జూలై, ఆగస్టు నెలల్లో వస్తున్న గోదావరి వరదలకు నిర్వాసితులను ఖాళీ చేయించడం పునరావాస కేంద్రాలకు తరలిస్తున్నారన్నారు. వీరికి నిత్యావసర సరుకులు, కూరగాయలు ఇచ్చి వదిలేస్తున్నారని ఆరోపించారు. ఏటా ఇదే జరుగుతోందని నిర్వాసితులకు పూర్తి స్థాయిలో పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు కే.కల్లయ్య, స్వయం చంద్రరావు, ఎస్.కె.మున్ని, గొమ్ముల వెంకటేశ్వర్లు, రమాదేవి పాల్గొన్నారు.

సుధాకర్ రెడ్డి మృతికి సంతాపం

కామవరపుకోట, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): సీపీఐ నాయకుడు సురవరం సుధాకర్‌రెడ్డి మృతికి స్థానిక సీపీఐ కార్యాలయంలో శనివారం నాయకులు, కార్యకర్తలు సంతాపసభను నిర్వహించారు. సుధాకర్ రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన చేసిన పోరాటాలను సీపీఐ మండల కార్యదర్శి టి.వి.ఎస్. రాజు గుర్తుచేశారు. సీపీఐ నాయకులు జి.సత్యనారాయణ, జి.లక్ష్మీనారాయణ, మీనుగుల దుర్గారావు, చలమాల శ్రీనివాసరావు, ఎమండ్ర స్వామిదాసు, కంకిపాటి యేసు, రాములమ్మ, నాగమణి పాల్గొన్నారు.

అంతా హాజరు కావాలి

బుట్టాయగూడెం, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): ఏలూరు పార్లమెంటరీ విస్తృత స్థాయి సమావేశం ఈ నెల 24న వట్లూరు మినీ బైపాస్ క్రాంతి కల్యాణ మండపంలో జరుగుతుందని పోలవరం నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని ఏపీ ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాసులు పిలుపునిచ్చారు. పార్లమెంటరీ కమిటీ, అనుబంధ కమిటీలకు పోటీలో అభ్యర్థుల పేర్లను త్రిమెన్ కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్ర కమిటీకి ప్రతిపాదనలు రూపంలో అందించడం జరుగుతుందన్నారు. ఉదయం 9నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతుందని ప్రతి ఒక్కరూ హాజరై అభిప్రాయాలను తెలియజేయాలన్నారు.

పోక్సో చట్టంపై అవగాహన

ఏలూరు అర్బన్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి) : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం పోక్సో చట్టంపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. బాలికలు, మహిళలపై లైంగిక వేధింపుల నివారణ, శిక్షలు, పెనాల్టీలగురించి వివరించారు. గుడ్ టచ్ - బ్యాడ్ టచ్‌లగురించి తెలియజేశారు. మొబైల్ ఫోన్లను అతిగా వినియోగించడం వల్ల నష్టాల గురించి వివరించారు. ప్రిన్సిపాల్ గిరిబాబు, స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ అమరశ్రీనివాస్, మహిళా పోలీసు స్టేషన్ ఎస్.ఐ. నాగమణి పాల్గొన్నారు.

బీఎస్ఎన్ఎల్ పథకాల ఆవిష్కరణ

ఏలూరుటూటౌన్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): బీఎస్ఎన్ఎల్ నుంచి సెల్ వినియోగదారులకు రెండు నూతన పథకాలు ప్రారంభించినట్లు బీఎస్ఎన్ఎల్ ప్రిన్సిపల్ జనరల్ మేనేజర్ ఎల్.శ్రీనివాస్ తెలిపారు. బీఎస్ఎన్ఎల్ కార్యాలయంలో శనివారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ బీఎస్ఎన్ఎల్ 4జీ సేవలను ప్రారంభించిందన్నారు. కేవలం ఒక్క రూపాయికే బీఎస్ఎన్ఎల్ వినియోగదారులకు సిమ్ అందిస్తున్నామన్నారు. ఈ పథకంలో అన్ లిమిటెడ్ వాయిస్‌కాల్స్ వాడుకోవచ్చన్నారు. రోజుకు 2జీబీ డేటా, 100 ఎస్ఎంఎస్‌లు వాడుకోవచ్చన్నారు. ఒక్క రూపాయి బీఎస్ఎన్ఎల్ ఫ్రీడమ్ ప్లాన్ ఈ నెలఖరు వరకు మాత్రమే అందుబాటులో ఉంటుందన్నారు. బీఎస్ఎన్ఎల్ ఐఎఫ్‌టీవీ ప్లాన్‌లో కేవలం నెలకు రూ.400 ఇంటర్ నెట్, టీవీ ఛానల్స్, ఓటీటీ ఛానల్స్ వాడుకోవచ్చన్నారు. 444 టీవీ ఛానల్స్ 9 ఓటీటీ ఛానల్స్ ఈ పథకంలో వర్తిస్తాయన్నారు. హైస్పీడ్ ఇంటర్నేట్ అందుబాటులో ఉంటుందన్నారు. డిప్యూటీ జనరల్ మేనేజర్ సోమయాజులు, డీఈలు, ఏఈలు పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లో డిగ్రీ అడ్మిషన్లు

కామవరపుకోట, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏపీ ప్రభుత్వ ఉన్నత విద్యా మండలి ఆదేశాలతో 2025-26 విద్యా సంవత్సరానికి ఆన్‌లైన్ విధానంలో అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమైనట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.విజయబాబు శనివారం తెలిపారు. తమ కళాశాలలో బిఏ పొలిటికల్ సైన్స్, బీఏ ఎకనామిక్స్, బీకాం కంప్యూటర్ అప్లికేషన్స్, బీఎస్సీ జువాలజీ కోర్సుల్లో ప్రవేశాలు పొందాలనుకునే అభ్యర్థులు ఈనెల 26వ తేదీ వరకు ఆన్‌లైన్ విధానం ద్వారా దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. 28వ తేదీ వరకు వెబ్ ఆప్షన్స్ నమోదు, ఆగస్టు 31న సీట్ల కేటాయింపు, సెప్టెంబర్ ఒకటవ తేదీ నుంచి తరగతులు ప్రారంభమవుతాయన్నారు. మహిళా విద్యార్థులకు కళాశాలల ప్రాంగణంలోని హాస్టల్‌లో ఉచిత సౌకర్యం కల్పించామన్నారు. ఎన్ఎస్ఎస్ విభాగం, మహిళా సాధికార విభాగం, స్టడీ అవర్స్, డిజిటల్ క్లాస్ రూము, గ్రంథాలయ సదుపాయం కళాశాలలో ఉన్నాయన్నారు. విద్యార్థులకు హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేసి కళాశాలలోనే రిజిస్ట్రేషన్ ప్రక్రియ చేపడుతున్నట్టు తెలిపారు.



కలెక్టరేట్‌లో ప్రతిజ్ఞ చేస్తున్న సిబ్బంది..



కార్మికులకు నగదు ఇస్తున్న ఎమ్మెల్యే చంటి



లింగపాలెంలో ప్రతిజ్ఞ చేస్తున్న దృశ్యం



గుడివాకలంకలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

పరిసరాలు శుభ్రంగా ఉంచాలి

» జిల్లా వ్యాప్తంగా అవగాహన ర్యాలీలు » విద్యార్థులు, ప్రజల చేత ప్రతిజ్ఞలు

ఏలూరు,ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి):స్వచ్ఛాంధ్ర- స్వచ్ఛ దివస్‌లో భాగంగా కలెక్టరేట్‌ను సిబ్బంది శనివారం శుభ్రం చేశారు. కలెక్టరేట్‌లో పరిసరాల్లో ఎక్కడా చెత్త లేకుండా, ప్లాస్టిక్ వ్యర్థాను తొలగించారు. కలెక్టరేట్ పరిపాలనాధికారి నాంచారయ్య ఆధ్వర్యంలో సూపరింటెండెంట్లు రవికుమార్, చెల్లన్న దొరలు పాల్గొన్నారు.

● ఏలూరు: వాణిజ్య పన్నుల శాఖ అసిస్టెంట్ కమిషనర్-2 బి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మెయిన్ బజార్ పెరుగుచెట్టు కమర్షియల్ టాక్స్ ఏలూరు -2 సర్కిల్ కార్యాలయం వద్ద పరిసరాల పరిశుభ్రత చేపట్టారు. ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా జాయింట్ సెక్రటరీ జి.జాన్‌బాబు, కె.చిట్టిబాబు పాల్గొన్నారు.

● ఏలూరుటూటౌన్: 36వ డివిజన్‌లో ఎమ్మెల్యే బడేటి చంటి నగరంలో శానిటేషన్ పనులు సక్రమంగా నిర్వర్తించిన వారికి రూ.5 వేల చొప్పున నగదు ప్రోత్సాహకంగా అందజేశారు. మేయర్ షేక్ నూర్జహాన్ పరిసరాల శుభ్రతపై అవగాహన కల్పించారు. కార్పొరేటర్ భీమవరపు హేమసుందరి సురేశ్, చల్లా విజయ్, పరశురామ్, లక్ష్మణరావు,మోహన్, క్లస్టర్ ఇన్‌ఛార్జ్ బాలాజీ, జే.సంతోషి, ఇడా చైర్మన్ శివప్రసాద్, ఏఎంసీ చైర్మన్ ఎం.పార్థసారథి కోఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు, చోడే వెంకటరత్నం, డిప్యూటీ మేయర్ పప్పు ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

● పోలవరం: పోలవరంలో ఏపీ ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాసులు ఆధ్వర్యంలో పంచాయతీ ఆవరణ బయట మురుగు కుంటలు,డ్రైనేజీల్లో దోమల నివారణ మందు స్ప్రే చేయించారు. ఎంపీడీవో చెరుకూరి శ్రీనివాస్ బాబు, గంగరాజు, మంగిన కొండ పాల్గొన్నారు.

● ఏలూరు రూరల్: శ్రీపర్రు గ్రామంలో ఎంపీడీవో వేన్నా శ్రీలత పారిశుధ్య కార్యక్రమాలు పరిశీలించారు. ప్రతి నెలా మూడో శనివారం విధిగా నిర్వహిస్తున్న స్వచ్ఛాంధ్ర- స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలన్నారు. రూరల్ మండలంలోని గుడివాకలంక గ్రామం మోడల్ ప్రైమరీ పాఠశాల విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు.అనంతరం పరిశుభ్రతపై ప్రతిజ్ఞ చేయించారు. హెచ్ఎం నంబూరి రాంబాబు, ఉప సర్పంచ్ నేలపాల జగపతిబాబు, టీడీపీ గ్రామాధ్యక్షులు ఘంటసాల సుబ్రహ్మణ్యం, సెక్రటరీ కోటేశ్వరరావు పాల్గొన్నారు.

● దెందులూరు: పంచాయతీ ఆధ్వర్యంలో కార్యదర్శి స్టానిక్ బాబు, సర్పంచ్ యేసమ్మలు అవగాహన ర్యాలీని నిర్వహించారు. అలాగే కొవ్వలిలో పంచాయతీ కార్యదర్శి పెదప్రొలు ఆదిలక్ష్మీ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అన్ని ప్రభుత్వ శాఖల అధికారులతో కలిసి పంచాయతీ కార్యాలయం నుంచి గాంధీనగర్, రాజుల పేట, కళింగపేట, యాదవ్ నగర్, దళితవాడ, తదితర ప్రాంతాల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు.

● టి.నర్సాపురం: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారిని డాక్టర్ జే.కల్పనారాణి ఆధ్వర్యంలో ఆసుపత్రి పరిసరాలను శుభ్రం చేశారు. చింతలపూడి మలేరియా సబ్‌యూనిట్ అధికారి ఎస్.ఎ.ప్రసాద్ ఆధ్వర్యంలో ప్రతిజ్ఞ చేయించారు. పీహెచ్ఎన్ కోవడమ్మ, ఎల్‌టీ దుర్గా, హెల్త్ అసిస్టెంట్ అమర్ పాల్గొన్నారు.

● చింతలపూడి: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో దోమల నివారణ మందు స్ప్రే చేయించారు. ప్రిన్సిపల్ శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థులు పర్యావరణం, పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని, మీ పరిసరాల్లో వారికి కూడా తెలియజెప్పాలన్నారు. ఎన్ఎస్ఎస్ అధికారి ఎ.వెంకటేశ్వరరావు పర్యవేక్షించారు.

● ఏలూరు: లింగపాలెం మండలంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల్లో ఎంపీడీవో కె.వాణి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి పాఠశాలల్లో విద్యార్థులు, ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాల వద్ద మొక్కలు నాటారు. డిప్యూటీ ఎంపీడీవో ఎ.సుందరి, తహసీల్దార్ నజీముల్లాషా, పి ఆంజనేయులు పాల్గొన్నారు.

రవికిరణ్‌కు డీఎస్సీలో 12వ ర్యాంకు



ఆగిరిపల్లి, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీ ఫలితాలలో ఈదరకు చెందిన నీలం రవికిరణ్ స్కూల్ అసిస్టెంట్ సోషల్ విభాగంలో 12వ ర్యాంక్ సాధించి, ఉపాధ్యాయ పోస్టుకు అర్హత సాధించాడు. ప్రస్తుతం ఎన్టీయార్ జిల్లా విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్‌లో సచివాలయ వెల్ఫేర్ సెక్రట రీగా పనిచేస్తున్నాడు. శనివారం విడుదలైన ఫలితాలలో విజయం సాధించినందుకు గాను ఈదర గ్రామస్థులు అతనిని అభినందించారు.

సురవరం మృతి ఉద్యమాలకు తీరనిలోటు

నూజివీడు, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): సీపీఐ జాతీయ మాజీ కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి మృతి కమ్యూనిస్టు ఉద్యమాలకు తీరని లోటని ఆ పార్టీ సీనియర్ నాయకుడు కొమ్మన నాగేశ్వరరావు అన్నారు. నూజివీడులో జరిగిన సంతాప సభలో ఆయన మాట్లాడుతూ నూజివీడు సమీపంలోని నేలపాటికుంట వద్ద చారిత్రక భూపోరాట చిహ్నాన్ని సుధాకర్‌రెడ్డి ఆవిష్కరించారని గుర్తు చేశారు. సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు చలసాని రామారావు, నియోజకవర్గ కార్యదర్శి నరసింహ తదితరులు సంతాపాన్ని తెలిపారు.

29న మెగా జాబ్‌మేళా : ఎమ్మెల్యే కామినేని

కైకలూరు, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): కైకలూరులో నిర్వహించే మెగా జాబ్‌మేళాను నిరుద్యోగ యువతీయువకులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ అన్నారు. శనివారం వరహాపట్నంలో జాబ్‌మేళా పోస్టర్లను ఆవిష్కరించారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మెగా జాబ్‌మేళా ఈ నెల 29న కైకలూరు ట్రావెలర్స్ బంగ్లాలో నిర్వహిస్తున్నామని పలు కంపెనీల ప్రతినిధులు ఈ మేళాలో పాల్గొంటారని నియోజకవర్గంలోని యువతీయువకులు పెద్దఎత్తున తరలివచ్చి ఈ ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. ఎంపీపీ అడవి కృష్ణ, కూటమి నేతలు పేరిచర్ల ప్రసాదరాజు, పైడిపాటి శివశంకర్, కొల్లి వరప్రసాద్, నల్లగోపుల చలపతి, నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారులు పాల్గొన్నారు.



కైకలూరులో ఆక్వా రైతుబజారును పరిశీలిస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి

ఎరువులు కొరత సృష్టిస్తే కఠిన చర్యలు : కలెక్టర్

కైకలూరు, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): ఎరువుల కృత్రిమ కొరత సృష్టించినా, అక్రమ రవాణా చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి అన్నారు. శనివారం కైకలూరు వారపు సంతలోని వాసవీ ఆక్వా బజార్, ఏటూజడ్ ఆక్వాదుకాణాల్లో ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. దుకాణాల్లోని స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. యురియా అక్రమ రవాణాను అడ్డుకునేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని ప్రతి రైతుకు ఎరువులు అందజేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. రైతులకు నానో యురియా, నానో డీఏపీపై అవగాహన కల్పించి వ్యవసాయంలో వినియోగించేలా చూడాలన్నారు. ఎరువుల అక్రమ రవాణా నివారించేందుకు అంత ర్రాష్ట్ర చెక్‌పోస్టుల వద్ద పటిష్ట నిఘాను ఏర్పాటుచేయాలని సూచించారు. ఎరువుల కొరత లేకుండా వ్యవసాయ, రెవెన్యూ శాఖ అధికారులు తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. ఆర్డీవో అచ్యుత్ అంబరీష్, వ్యవసాయాధికారి హబీబ్‌బాషా, మత్స్యశాఖ డిప్యూటీ డైరెక్టర్ బి. నరసయ్య, ఏడీఏ పార్వతి, తహసీల్దార్ ఎండీ ఇబ్రహీం, మండల వ్యవసాయాధికారి ఆర్. దివ్య, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలని కలెక్టర్‌కు వినతి

కలిదిండి: చినతాడినాడలో శనివారం తాగునీటి సమస్య పరిష్కరించాలని కలెక్టర్ వెట్రి సెల్వీకి విన్నవించారు. అందుకు ఆమె సానుకూలంగా స్పందించి తక్షణమే తాగునీటి ట్యాంకర్లు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటానన్నారు. తాగునీటి శాశ్వత పరిష్కారానికి ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్‌తో చర్చించి తాగునీటి సమస్య పరిష్కరిస్తానన్నారు.

ఎరువుల షాపుల తనిఖీ



చాట్రాయి, ఆగస్టు 23(అంధ్ర జ్యోతి): మండలంలో పలు ఎరువుల షాపులు, పీఏసీఎస్‌లను శనివారం వ్యవసాయ, రెవెన్యూ, పోలీస్ అధికారుల బృందం ఆకస్మిక తనిఖీలు నిర్వహించింది. ఏవో బి. శివశంకర్, ఎస్ఐ డి. రామకృష్ణ, ఆర్ఐ శ్రీనివాసరావు బృందం ఎరువుల క్రయవిక్రయాలకు సంబంధించిన రికార్డులను తనిఖీ చేశారు. యూరియాను అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. షాపుల బయట బ్లాక్ బోర్డులలో ఎరువుల నిల్వపై సమాచారం ఇవ్వాలని, రైతులకు ఎరువులు అమ్మిన వెంటనే బిల్లులు ఇవ్వాలని సూచించారు. యూరియాను పంట పొలాలకు మాత్రమే అమ్మాలని, ఇతర అవసరాలకు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. రైతులు నేల ఆరోగ్య, పర్యావరణ పరిరక్షణ కోసం నానో యూరియా, నానో డీఏపీ ఉపయోగించాలని సూచించారు.

తమ్మిలేరులో ఎత్తిపోతలకు ప్రణాళికలు : డీఈఈ

ముసునూరు, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకటాపురం వద్ద తమ్మిలేరులో ఎత్తిపోతలకు చర్యలు తీసుకుంటున్నట్లు ఇరిగేషన్ డీఈఈ వై.అర్జునరావు తెలిపారు. వెంకటాపురం వద్ద తమ్మిలేరులో టీడీపీ హయాంలో నిర్మించిన చెక్‌డ్యాం వరద ఉధృతికి కొట్టుకుపోయి నాలుగేళ్లయినా గత వైసీపీ ప్రభుత్వ కనీస మరమ్మతులు కూడా చేపట్టలేదు. అయితే ఎన్నికల ప్రచారం సమయంలో నూజివీడు ఎమ్మెల్యే అభ్యర్థిగా ఉన్న కొలుసు పార్థసారథి ఈ చెక్‌డ్యామ్‌ను పరిశీలించి, కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే చెక్‌డ్యాం నిర్మిస్తామని రైతులకు ఇచ్చిన హామీ మేరకు ఆరు నెలల క్రితం ఇరిగేషన్ ఉన్నతాధికారులను పంపి, ప్రతిపాదనలు తయారు చేయించా రు. ప్రసుత్తం వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో తాత్కాలికంగా తమ్మిలేరులో పంపింగ్ సిస్టం ద్వారా ఎత్తిపోతలకు ప్రణాళికలు తయారు చేయాలని మంత్రి ఆదేశాల మేరకు శనివారం ఇరిగేషన్ డీఈఈ అర్జునరావు దెబ్బతిన్న చెక్‌డ్యాం, సప్లైయి ఛానల్‌ను పరిశీలించి రైతులు, టీడీపీ నాయకులతో మాట్లాడుతూ ప్రతిపాదనలు ఉన్నతాధికారులకు అందిస్తామని తెలిపారు. టీడీపీ మండల అధ్యక్షుడు గద్దె రఘుబాబు, గ్రామ అధ్యక్షుడు మానం గంటేశ్వరరావు పాల్గొన్నారు.

ఘనంగా వల్లభనేని పుట్టిన రోజు వేడుకలు



వల్లభనేని శ్రీనివాస్ చౌదరికి శుభాకాంక్షలు తెలియసేస్తున్న ఎమ్మెల్యే కామినేని, జోగిరాజు

కలిదిండి, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): కలిదిండి వెంకటాపురంలో శనివారం ఏఎంసీ మాజీ చైర్మన్ వల్లభనేని శ్రీనివాస్ చౌదరి పుట్టిన రోజు వేడుకలను టీడీపీ శ్రేణులు ఘనంగా నిర్వహించాయి. కేక్‌ను కట్ చేసిన అనంతరం అన్నదానం నిర్వహించాయి. ఈ సందర్భంగా వల్లభనేని మాట్లాడుతూ కార్యకర్తలకు అందుబాటులో ఉంటూ ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ సహకారంతో వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్, టీడీపీ మండల అధ్యక్షుడు పోకల జోగిరాజు, మాజీ జడ్పీటీసీ రమాదేవి, డీసీ ఛైర్మన్లు ముద్దం బోగేశ్వరరావు, పేటేటి సత్యనారాయణ, వైస్ చైర్మన్ నున్న కృష్ణబాబు, టీడీపీ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు కురేళ్ల ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

సురవరం ఆశయ సాధనకు కృషి చేయాలి

చాట్రాయి, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): సీపీఐ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకరరెడ్డి మృతి పట్ల నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి వర్గ సభ్యుడు ఈవీ శ్రీనివాసరావు, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి కొమ్ము ఆనందం విచారం వ్యక్తం చేశారు. వీరు మాట్లాడుతూ సుధాకరరెడ్డి మరణించినా ఆయన ఆశయాలు ప్రజల హృదయాలలో పదిలంగా ఉంటాయని, ఆయన ఆశయాలకు అనుగుణంగా పనిచెయ్యటమే నిజమైన నివాళి అన్నారు. సురవరం కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం తెలిపారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	110, 118, 129
చికెన్ విత్ స్కిన్	210
చికెన్ స్కిన్‌లెస్	220

నెక్ కోడి గుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ.475

రంగా విగ్రహాలకు అవమానం



కలిదిండిలో రంగా విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే కామినేని, అభిమానులు

కలిదిండి, సొనారుద్రవరం గ్రామాల్లో విగ్రహాలకు పేడ పూసిన దుండగులు

అభిమానుల ధర్నా
ఎమ్మెల్యే కామినేని హామీతో నిరసన విరమణ



కలిదిండి, సొనారుద్రవరంల్లో రంగా విగ్రహాలకు పేడ పూసిన దుండగులు

కలిదిండి, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): ఏలూరు జిల్లా కలిదిండి మండలం కలిదిండి, సొనారుద్రవరం గ్రామాల్లో వంగవీటి రంగా విగ్రహాలకు అవమానం జరిగింది. గుర్తు తెలియని దుండగులు శుక్రవారం రాత్రి పేడ పూశారు. ఈ సమాచారం తెలుసుకున్న రంగా అభిమానులు శనివారం ఉదయం కలిదిండి సెంటర్‌లో రంగా విగ్రహం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదల అభ్యున్నతికి కృషి చేసిన రంగా విగ్రహానికి పేడ పూడియడం దారుణమని నినాదాలు చేశారు. దోషులను తక్షణమే కఠినంగా శిక్షించాలని ఆందోళన చేశారు. కైకలూరు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ సంఘటనా స్థలానికి విచ్చేసి దోషులను గుర్తించి త్వరలోనే చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో అభిమానులు నిరసన విరమిం చారు. ఈ ఘటన రెండు వర్గాల మధ్య ఆధిపత్య పోరులో భాగంగా కొంతమంది వ్యక్తులు ఈ దుశ్చర్యకు పాల్పడినట్లు పోలీసులు భావి స్తున్నారు. త్వరలోనే దోషులను గుర్తించి కఠినంగా శిక్షిస్తామని తెలిపారు.

రంగా విగ్రహానికి ఎమ్మెల్యే కామినేని క్షీరాభిషేకం

కలిదిండి సెంటర్‌లో ఉన్న రంగా విగ్రహానికి ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ శనివారం క్షీరాభిషేకం చేశారు. రంగా విగ్రహానికి పేడ పూయడాన్ని ఖండించారు. రంగా విగ్రహంపై పేడ పూసిన దోషులను తొందరగానే పట్టుకుని కఠినంగా శిక్షించాలని పోలీసులను ఆదేశించారు. కూటమి నాయకులు పాల్గొన్నారు.

దోషులను శిక్షించాలి : దూలం

సొనారుద్రవరంలో రంగా విగ్రహానికి పేడ పూసిన దోషులను నెలాఖరుకల్లా శిక్షించకపోతే నియోజకవర్గ స్థాయిలో కలిదిండిలో రంగా విగ్రహం వద్ద నిరాహార దీక్ష చేపడతానని వైసీపీ జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు హెచ్చరించారు. శనివారం కలిదిండిలో రంగా విగ్రహానికి క్షీరాభిషేకం చేసి నాయకులతో కలిసి నిరసన తెలిపారు.

దుండగులను కఠినంగా శిక్షిస్తాం : సీఎం చంద్రబాబు

కైకలూరు : వంగవీటి మోహనరంగా విగ్రహం గుర్తుతెలియని దుండగులు దుశ్చర్యకు పాల్పడిన ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తీవ్రస్థాయిలో ఖండించారు. శనివారం ఏలూరు జిల్లా కైకలూరు నియోజకవర్గం కలిదిండిలో వంగవీటి మోహనరంగా విగ్రహం పట్ల అనుచితంగా ప్రవర్తించిన సంఘటన ముఖ్యమంత్రి దృష్టికి వెళ్లగా తీవ్రస్థాయిలో స్పందించారు. అమరావతిలో సీఎం మాట్లాడుతూ నేతల విగ్రహాల పట్ల అవమానకర చర్యలకు పాల్పడిన వారికి గట్టి గుణపాఠం చెప్పేలా పోలీసులు చర్యలు తీసుకోవాలన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా నిందితులను పట్టుకుని కఠినంగా శిక్షించాలని ఆదేశించారు. అభిమానుల మనోభావాలు దెబ్బతినేలా శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడేవారిని ఉపేక్షించే ప్రసక్తి లేదన్నారు.

దోషులను త్వరలో పట్టుకుంటాం : డీఎస్పీ



విలేకరులతో మాట్లాడుతున్న డీఎస్పీ శ్రావణ్ కుమార్

ఆ రెండు గ్రామాల్లో రంగా విగ్రహాలకు పేడ పూసిన దోషులను త్వరలోనే పట్టుకుంటామని డీఎస్పీ శ్రావణ్ కుమార్ తెలిపారు. శనివారం రాత్రి కలిదిండి పోలీస్ స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దోషులను పట్టుకోవటానికి ఆరు పోలీసు బృందాలను ఏర్పాటు చేశామన్నారు. డాగ్ స్క్వాడ్, క్లూస్ టీమ్‌లు సంఘటనా స్థలాన్ని పరిశీలించాయన్నారు. రెండు వర్గాల మధ్య ఆధిపత్య పోరులో భాగంగా కొంతమంది వ్యక్తులు ఈ దుశ్చర్యకు పాల్పడినట్లు భావిస్తున్నామన్నారు. నిందితుల ఆచూకీ ఎవరికైనా తెలిస్తే పోలీసులకు సమాచారం అందించిన వారికి బహుమతి అందిస్తామన్నారు. సీఐ రవికుమార్, ఎస్ఐ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

నేడే పోటాపోటీగా రంగా విగ్రహాల ఆవిష్కరణ

▸▸ **ఈడేపల్లి గ్రామంలో పోలీసు బందోబస్తు**



రంగా విగ్రహాల వద్ద పోలీస్ బందోబస్తు

ముదినేపల్లి: ఈడేపల్లి గ్రామంలో ఆదివారం జరుగనున్న దివంగత నేత వంగవీటి మోహనరంగా విగ్రహాల ఆవిష్కరణ సందర్భంగా పెద్దఎత్తున పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆ గ్రామంలో ఒకేచోట పక్కపక్కనే ఒకే సామాజిక వర్గానికి చెందిన ఇరువర్గాలు రెండు రంగా విగ్రహాలను ఏర్పాటు చేయడం, రెండు విగ్రహాలు ఒకేసారి ఆవిష్కరణ చేయనుండడతో వివాదాలు, ఉద్రిక్తతలు చోటు చేసుకునే అవకాశం ఉందనే ఉద్దేశంతో పటిష్టమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. విగ్రహా విష్కరణలు జరిగే ప్రదేశాల వద్ద రోడ్డు వెంబడి సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. శనివారం స్పెషల్ బ్రాంచ్, ఇంటెలిజెన్స్ వర్గాలు గ్రామంలో పరిస్థితులను పరిశీలించారు. రెండు విగ్రహాలు పక్కపక్కనే ఉన్నందున ఆవిష్కరణల సమయంలో అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నామని కైకలూరు రూరల్ సీఐ రవికుమార్ తెలిపారు. శనివారం నుంచే గ్రామంలో పోలీస్ పహారా ఏర్పాటు చేసినట్టు తెలిపారు. విగ్రహాల ఆవిష్కరణకు తొలుత ముదినేపల్లి నుంచి ఈడేపల్లి వరకు రంగా అభిమానులు, నాయకులు సుమారు 11 కిలోమీటర్ల దూరం భారీ ర్యాలీ నిర్వహించనున్నందున దారి పొడవునా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. రంగా తనయుడు వంగవీటి రాధాకు స్వాగతం పలికేందుకు ఇరువర్గాలు పోటీపడే అవకాశాలున్నట్టు ఇంటెలిజెన్స్‌వర్గాలు ఉన్నతాధికారులకు నివేదిక పంపారు.

వెంకటరత్నంకు అభినందన

ఆగిరిపల్లి, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): పశ్చిమ గోదావరి జిల్లా అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్‌గా బాధ్యతలు చేపట్టిన కె. వెంకటరత్నంకు శనివారం ఆగిరిపల్లి కిరాణా వర్తక సంఘం సభ్యులు అభినందనలు తెలిపారు. శనివారం ఏలూరు కార్యాలయంలో ఆగిరిపల్లి కిరాణా వర్తక సంఘం అధ్యక్షుడు కల్లూరి ముక్తేశ్వర రావు నేతృత్వంలో ఆయనను కలిసి అభినందించారు. కార్యదర్శి ఆలమూరు శోభన్‌బాబు, వైవికె రమేష్, తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులో యూరియా

నూజివీడు, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): నూజివీడు మండలంలో 48 మెట్రిక్ టన్నుల యూరియా పీఏసీఎస్, ప్రైవేట్ డీలర్ల వద్ద అందుబాటులో ఉందని, రైతులు ఆందోళన చెందవద్దని నూజివీడు తహసీల్దార్ బి.భద్రునాయక్ తెలిపారు. శనివారం మండలంలోని ఎరువుల షాపులను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. రైతులందరికి బయోమెట్రిక్ విధానంలోనే ఎరువులు విక్రయించాలని డీలర్లకు స్పష్టం చేశారు. రైతులు వారు కొనుగోలు చేసిన ఎరువులకు తప్పనిసరిగా బిల్లులు పొందాలని తెలిపారు. అధిక రేట్లకు అమ్మితే డీలర్ల పై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు.

స్టీల్ వాటర్ బాటిళ్ల వితరణ

కైకలూరు, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణకు ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని న్యాయవాది పి. పవన్‌కాంత్ అన్నారు. శనివారం గోనెపాడు ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు స్టీల్ వాటర్ బాటిళ్లను పంపిణీ చేశారు. భూపతిరాజు వెంకటేశ్వర వర్మ, తలాటి దుర్గాప్రసాద్, పిండి చైతన్య, హెచ్‌ఎం రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

అంతరిక్ష పరిశోధనలపై ర్యాలీ

కైకలూరు, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): అంతరిక్ష పరిశోధనలో ప్రపంచలోనే భారత్ అగ్రగామిగా ఉంటుందని కళాశాల ప్రిన్సిపాల్ వై. శ్రీలత అన్నారు. శనివారం కైకలూరు వైవీఎన్నార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అవగాహన ర్యాలీ నిర్వహించారు. అంతరిక్ష పరిశోధనల్లో భారత్ చేపడుతున్న విధానాలను, విజయాలను విద్యార్థులకు వివరించారు. భౌతికశాస్త్ర అధ్యాపకుడు డాక్టర్ పాల్ దివాకర్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కేదారి, అధ్యాపకులు పాల్గొన్నారు.

నాయీ బ్రాహ్మణుల సంక్షేమానికి ప్రాధాన్యం : మంత్రి సారథి



సెలూన్‌ను సందర్శించిన మంత్రి పార్థసారథి

చాట్రాయి, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): హామీ మేరకు నాయీ బ్రాహ్మణులు సంక్షేమానికి కూటమి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తున్నదని గృహ నిర్మాణశాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. శుక్రవారం రాత్రి చాట్రాయి సెంటర్‌లో నియోజకవర్గ నాయీ బ్రహ్మణ సాధికార కమిటీ సభ్యుడు రాయవరపు సీతారాములు బార్బర్ షాపును సందర్శించి నాయీ బ్రాహ్మణులతో ముచ్చటించారు. మంత్రి మాట్లాడుతూ సెలూన్ షాపులకు నెలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకాన్ని కేబినెట్ ఆమోదించినందున త్వరలో అమల్లోకి వస్తుందని, నాయీ బ్రాహ్మణులు వృత్తినైపుణ్యాన్ని పెంచుకొని, కార్పొరేట్ స్థాయిలో సెలూన్స్ ఏర్పాటు చేసుకుంటే బ్యాంకుల నుంచి రుణాలు మంజూరు చేయిస్తామని హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం ఆలయాల్లో పని చేసే నాయీ బ్రాహ్మణులు వేతనాలు రూ. 15 వేల నుంచి రూ 25 వేలకు పెంచామని, ఆలయ కమిటీల్లో ఒక నాయీ బ్రాహ్మణుడిని సభ్యుడుగా నియమిస్తున్నామన్నారు. 50 ఏళ్లకు పెన్షన్ అమలుకు సమయం పట్టవచ్చునని అన్నారు. మంత్రి వెంట కూటమి నాయకులు మందపాటి బసవారెడ్డి, ఇజ్జిగాని వెంకటేశ్వరరావు, రాయవరపు పుల్లారావు, తేళ్ళూరి శేఖర్, ఆదిమాలం శర్మ తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న జడ్జి ఎం. శివపార్వతి

బాల్య వివాహాలు అనర్థం

నూజివీడు, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి):ఆడపిల్లలకు 18 ఏళ్లు, మగ పిల్లలకు 21 ఏళ్లు నిండకుండా వివాహాలు చేయటం నేరమని నూజివీడు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎం.శివపార్వతి తెలిపారు. బాల్య వివాహాలు, ఎర్లీ ప్రెగ్నెన్సీపై అవగాహన కల్పించాలని, హైకోర్టు, జిల్లా కోర్టు ఆదేశాల మేరకు శనివారం నూజివీడు ఎమ్మార్ అప్పారావు కాలనీలో మహిళలకు, విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. జడ్జి శివపార్వతి ముఖ్య అతిథిగా మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా బాల్యవివాహాలు చేస్తే తీవ్ర శిక్షలు ఎదుర్కోవాల్సి ఉంటుందన్నారు. ఐసీడీఎస్ అధికారులు ధనలక్ష్మి, ఎమ్మార్ అప్పారావుకాలనీ వార్డు ప్రసిడెంట్ ఎస్.డి నజీమ, ఏఎన్ఎం శ్రీదేవి, హెల్త్ అసిస్టెంట్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



కాట్రేనిపాడులో అధికారులు, విద్యార్థుల ర్యాలీ

స్వచ్ఛాంధ్ర.. స్వర్ణాంధ్ర

నూజివీడు, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): సీఎం పిలుపు మేరకు స్వచ్ఛ ఆంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమం శనివారం నూజివీడులో జరిగింది. దోమల నిర్మూలనకు మలాథియాన్ స్ప్రే చేశారు. పట్టణంలోని పలు షాపుల యజమానులకు ప్లాస్టిక్ క్యారీబ్యాగుల నిషేధం పై అవగాహన కల్పించారు. నూజివీడు ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో స్టేషన్ పరిసరాలను ఎక్సైజ్ సిబ్బంది శుభ్రపరిచి ప్రతిజ్ఞ చేశారు.

ముసునూరు: స్వచ్ఛ గ్రామాల సాధనకు ప్రజలు సహకరించాలని తహసీల్దార్ ప్రశాంతి, ఎంపీడీవో సత్యనారాయణ అన్నారు. శనివారం పలు గ్రామాల్లో అవగాహన ర్యాలీలు నిర్వహించారు. 20 మరుగుదొడ్ల నిర్మాణాలను ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సత్యప్రసాద్ ప్రారంభించారు.

సైకిల్ సారథి.. ఎవరు?

(3వ పేజీ తరువాయి)

వివిధ నియోజకవర్గాల్లో ఇప్పటికే అనుకూలత వ్యక్తమవుతోంది. అయితే ఈ మధ్యనే ఆయనకు డీసీసీబీ, ఆప్కాబ్ ఛైర్మన్ వంటి పదవులు లభించడంతో తిరిగి ఆయన్నే కొనసాగిస్తారా అనేది తేలబోతుంది. సీనియర్ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ పేరును మరికొందరు ప్రస్తావిస్తున్నారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో పార్టీకి పూర్తిగా అండగా నిలబడే నేత అవసరమని ఆ సత్తా ప్రభాకర్‌కు ఉందనేది మరికొందరి వాదన. ఇంకోవైపు ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి పేరు అధ్యక్ష రేసులో ప్రస్తావనకు వస్తోంది. ఆయన అనుచరులు కూడా ఇలాంటి డిమాండ్‌కు మద్దతు ఇస్తున్నారు. చంటి మాత్రం ఇప్పటివరకు ఈ అంశంపై నోరు విప్పలేదు. కొందరేమో మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళికి బీసీ వర్గాల నుంచి జంగారెడ్డిగూడెంకు చెందిన శ్యామ్ చంద్ర శేషుకు అవకాశం ఇవ్వాలని అంతర్గతంగా డిమాండ్ చేస్తున్నారు. అయితే ఏడు నియోజకవర్గాల పరిధిలో ఇప్పటికే అత్యధికులు అభిప్రాయాలను ఆయా నియోజక వర్గాల నేతలు రాబట్టినట్టు సమాచారం. ఇంకోవైపు సాధ్యమైనంత మేర ఒకరిద్దరి పేర్లను సూచించాల్సిందిగా పరిశీలకులకు ఆదేశాలందినట్టు చెబుతున్నారు.

తల్లికి వందనం వేరొకరి ఖాతాలో వేశారని మంత్రికి ఫిర్యాదు



బాధిత కుటుంబం

చాట్రాయి, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): తన కుమార్తె తల్లికివందనం సొమ్ము వేరే ఖాతాకు జమ చేశారని పరిశీలించి న్యాయం చెయ్యాలని చాట్రాయి గ్రామానికి చెందిన తేలూరి అర్జునరావు మంత్రి పార్థసారథికి శుక్రవారం రాత్రి వినతిపత్రం అందజేశారు. తన కుమార్తె రిత్విక చాట్రాయి మెయిన్ ఎలిమెంటరీ పాఠశాలలో రెండో తరగతి చదువుతున్నదని, ఇటీవల విడుదలైన తల్లికివందనం సొమ్ము ఇదే పాఠశాలలో చదువుతున్న మరో విద్యార్థిని తండ్రి ఖాతాలో రూ . 13 వేలకు బదులు రూ. 26 వేలు జమచేశారని తెలపగా సొమ్ము ఇప్పించటానికి చర్యలు తీసుకోవాలని మంత్రి అధికారులను ఆదేశించారు.

బీజేపీ మండల అధ్యక్షుడిగా నాగ శివ



నూజివీడు, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి):నూజివీడు రూరల్ బీజేపీ అధ్యక్షుడిగా నక్కా నాగశివ నియమితులయ్యారు. శనివారం నూజివీడులో జరిగిన పార్టీ మండల సమావేశంలో బీజేపీ ఏలూరు జిల్లా ప్రధాన కార్యదర్శులు గాదే రాంబాబు, నగరపాటి సత్యనారాయణ దీనిని అధికారికంగా ప్రకటించారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ సెప్టెంబరు 3న రాష్ట్రబీజేపీ పార్టీ అధ్యక్షుడు పి.వి.ఎన్ మాధవ్, ఏలూరు రానున్నట్లు, ఆయనకు ఘన స్వాగతం పలికేందుకు నూజివీడు అసెంబ్లీ పార్టీశ్రేణులు పెద్దఎత్తున తరలి రావాలని సూచించారు.

పాఠశాల సందర్శన

మండవల్లి, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని అయ్యవారి రుద్రవరంలో గల మోడల్ ప్రైమరీ పాఠశాలను సమగ్ర శిక్షా జిల్లా అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ పంకజ్‌కుమార్ శనివారం పరిశీలించారు. ప్రతి సోమవారం జిల్లా కేంద్రంలో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన పిర్యాదును పరిశీలించి తక్షణ చర్యలు తీసుకునే నిమిత్తం క్షేత్రస్థాయి పర్యటన కోసం వచ్చినట్లు తెలిపారు.

త్వరలో ఆలయ ట్రస్ట్ బోర్డు

ముదినేపల్లి, ఆగస్టు 23 (అంధ్రజ్యోతి): ముదినేపల్లి మండలం సింగరాయపాలెం-చేవూరుపాలెం సెంటర్‌లోని శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయ ధర్మకర్తల మండలి ఎట్టకేలకు ఏర్పాటు కానుంది. ధర్మకర్తల మండలి ఏర్పాటుకు 9 మంది సభ్యులతో నాయకులు సిద్ధం చేసిన జాబితాను స్థానిక ఎమ్మెల్యే కామినేని సిఫార్సు చేస్తూ కమిషనర్‌కు పంపినట్లు తెలిసింది.

టీబీపై అవగాహన

ముదినేపల్లి, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): ముదినేపల్లిలోని ఐటీఐ కళాశాలలో శనివారం వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో టీబీపై అవగాహన సదస్సును నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ కూనపరెడ్డి సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముదినేపల్లి పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వి.శాంతిశ్రీ మాట్లాడుతూ టీబీ రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను విద్యార్థులకు సూచించారు. ఊపిరితిత్తులకు హాని కలగని ఆహార పదార్థాలు తీసుకోవాలని, మద్యపానం, ధూమపానానికి దూరంగా ఉండాలని తెలిపారు. పీహెచ్‌సీ ఎస్‌టీఎస్ బి.వినయ్ కుమార్, ఏఎన్ఎం ఎలీనా రాణి, వైస్ ప్రిన్సిపాల్ హరిత, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

చేతుల శుభ్రతపై అవగాహన

ముసునూరు, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): మండల వ్యాప్తంగా గల అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలల్లో విద్యార్థులకు చేతుల శుభ్రతపై ఆరోగ్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు శనివారం అవగాహన కల్పించారు. చేతులు శుభ్రం చేసుకునే పద్ధతులను ప్రత్యక్షంగా చేసి చూపించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాజ్యలక్ష్మీ మాట్లాడుతూ చేతులు శుభ్రం చేసుకోకుండా మనం తీసుకునే ఆహారం వల్ల అనేక ఆరోగ్య సమస్యలు ఏర్పడతాయన్నారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాల ప్రాంగణాల్లో మొక్కలు నాటారు. ఆశావర్కర్లు, మహిళా పోలీసులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'మత్తు'తో అనర్థాలు

ముదినేపల్లి, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): ఆర్థికంగా, ఆరోగ్యపరంగా నష్టపరిచే మత్తు పదార్థాలకు ప్రతి ఒక్కరూ దూరంగా ఉండాలని నవజీవన్ బాల భవన్ ప్రోగ్రాం మేనేజర్ గోళ్లమూడి శేఖర్ బాబు అన్నారు. వడాలి జడ్పీ హైస్కూల్‌లో శనివారం విద్యార్థులకు మాదక ద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై బాలభవన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. హెచ్‌ఎం ప్రభుదాసు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ముదినేపల్లి పోలీస్ స్టేషన్ హెచ్‌సీ సుధారాణి, నీతోడు మానసిక వికాస కేంద్రం జోనల్ కో-ఆర్డినేటర్ ఎం.లీలావతి పాల్గొని మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలను వివరించారు. ఈ సందర్భంగా తాము మత్తు పదార్థాల జోలికి వెళ్లమని విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు.

వివాహిత ఆత్మహత్య

ముదినేపల్లి, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): భర్త వేధింపులు భరించలేక పుట్టింటికి చేరిన ఓ వివాహిత పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం కలిదిండి మండలం కోరుకొల్లుకు చెందిన కామాక్షికి చల్లపల్లి మండలం మంగళాపురం గ్రామానికి చెందిన పేరం శ్రీనుతో 12 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు పిల్లలు. తాగుడుకు బానిసైన శ్రీను ఇబ్బందులు తట్టుకోలేక కామాక్షి ఇటీవల కోరుకొల్లు వచ్చేసింది. 20 రోజుల క్రితం భర్త శ్రీను కోరుకొల్లు వచ్చి హాస్టల్‌లో ఉంటున్న పిల్లల్ని మంగళాపురం తీసుకువెళ్లాడు. దీంతో మనోవేదనకు గురైన కామాక్షి ఈ నెల 8న పురుగుల మందు తాగి తన చెల్లికి ఫోన్ చేసి తాను ముదినేపల్లిలో ఉన్నానని చెప్పింది. వెంటనే కుటుంబ సభ్యులు వచ్చి ఆమెను గుడివాడ ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లి మెరుగైన చికిత్స కోసం విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం కామాక్షి మృతి చెందింది. ఆమె తండ్రి సుబ్బారావు పిర్యాదు మేరకు ముదినేపల్లి హెచ్‌సి శంకర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.